సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శుక్రవారం, 03.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 161
పేజీలు: 12 వెల: రూ. 5

# మూసీపై ఇక ముందుకే.!

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌పై ఎన్జీటీ విచారణ



- బీఆర్ఎస్ నేత కార్తిక్ రెడ్డి పిటిషన్ డిస్మిస్
- సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలు లేవని పిటీషన్ డిస్మిస్
- అనుమానాలతో ప్రాజెక్టు అడ్డుకోవడం కుదరదని వ్యాఖ్య
- ప్రభుత్వానికి న్యాయపరమైన అడ్డంకి తొలగినట్టే
- మూసీ సుందరీకరణ పనులకు వేగం పెరిగే అవకాశాలు
- ఎస్టీపీలు, రిటైనింగ్ వాల్స్, చెక్‌డ్యామ్‌ల పనులు వేగవంతం
- రూ.50 వేల కోట్ల భారీ ప్రాజెక్టుతో మూసీకి కొత్త రూపం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో ఊరట వచ్చింది. మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టును సవాల్ చేస్తూ.. బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన ఎన్జీటీ.. రాష్ట్ర ప్రభుత్వానికి రిలీఫ్ ఇచ్చింది. మూసీ ప్రక్షాళన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని.. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని కార్తిక్ రెడ్డి ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. గాంధీ సరోవర్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించారని పిటిషనర్ మిగతా 02లో



## చేనేత కార్మికుల పొట్ట కొడుతోన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్



- టెస్కో నుంచి రూ. 105 కోట్ల యూనిఫాం టెండర్ రద్దు వెనక మతలబేంటి?
- చేనేత కార్మికులపై కాంగ్రెస్ కుట్ర అన్న కల్వకుంట్ల కవిత
- విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడం దుర్మార్గ చర్య

09

## అమరావతి బిల్లుకు రాజ్యసభ ఆమోదం

### మూజువాణి ఓటుతో బిల్లుకు గ్రీన్ సిగ్నల్



- లోక్‌సభ తర్వాత ఎగువ సభలోనూ అమరావతికి మద్దతు వెల్లువ
- వైకాపా వాకౌట్ మధ్య బిల్లు ఆమోదం..
- రాష్ట్రపతి ఆమోదమే తరువాయి

10

## ఐప్యాక్ పై ఈడీ దాడులు




- హైదరాబాద్, బెంగళూరు, ముంబై నగరాల్లోని కార్యాలయాల్లో తనిఖీలు
- మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో సోదాలు

09

# దారులన్నీ కొండగట్టుకే

### జిల్లాల నుంచి పాదయాత్రగా అంజన్న సన్నిధికి

- కాషాయ మయమైనా అంజన్న క్షేత్రం
- అంజన్న దర్శించుకుంటున్న లక్షలాది భక్తులు
- అసౌకర్యాలతో భక్తుల ఇక్కట్లు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీలు

03





హైదరాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర

# తెలంగాణే మా ట్రాక్ రికార్డ్

### కేరళలోనూ 5 గ్యారంటీలు!

- యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గ్యారంటీల అమలుపై సందేహాలుంటే తెలంగాణకు రావాలని పిలుపు
- అవినీతి కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్ విజయన్ కుటుంబాలు
- తొలి క్యాబినెట్ నుంచే హామీలు చేశామన్న సీఎం రేవంత్




**ముద్ర , తెలంగాణ బ్యూరో :** యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి.. తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు. కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపుతామని సీఎం తెలిపారు. కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మేనిఫెస్టోను కొచ్చిలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేరళంలో పినరాయి విజయన్ హయాం ముగిసిందని మిగతా 02లో

# ఢిల్లీకి గ్రానైట్ స్కామ్

### కరీంనగర్ గ్రానైట్ అక్రమాలపై కేంద్ర సంస్థల దృష్టి

- రంగంలోకి సీబీఐ, ఎన్‌జీటీ, ఈడీ
- రూ.749 కోట్ల రాయల్టీ ఎగవేత..
- పీఎంవో దృష్టికి చేరిన స్కాం..
- లైసెన్స్‌లు లేకుండా తవ్వకాలు..
- అధికారుల కుమ్మక్కుతో భారీ అక్రమాల వెలుగు
- ఫెమా ఉల్లంఘన కోణంలో దర్యాప్తు..
- విదేశీ ఖాతాల్లో నల్లధనం దాచిన అనుమానాలు

03



*కరీంనగర్ గ్రానైట్ అక్రమ మైనింగ్ వ్యవహారం ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీని కుదిపేస్తోంది. సుమారు రూ. 749 కోట్ల రాయల్టీ ఎగవేతతో పాటు, వేల కోట్ల రూపాయల విలువైన గ్రానైట్ దోపిడీపై ప్రధాని కార్యాలయం (పీఎంవో) సీరియస్‌గా స్పందించింది. లైసెన్స్‌లు లేని తవ్వకాలు, అధికారుల కుమ్మక్కు, విదేశీ మారకద్రవ్య నియంత్రణ చట్టం (ఫెమా) ఉల్లంఘనల వంటి సంచలన ఆరోపణల నేపథ్యంలో.. సీబీఐ, ఈడీ, ఎన్‌జీటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయి. విజిలెన్స్ నివేదికల ఆధారంగా త్వరలోనే కేంద్ర బృందాలు జిల్లాలో పర్యటించనుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.*

-ముద్ర, కరీంనగర్

# తెలంగాణపై నిర్లక్ష్యమేల?

### 12 ఏళ్లయినా విభజన హామీల అమలు లేదు

- కేంద్రాన్ని నిలదీసిన తెలంగాణ ఎంపీలు
- లోక్‌సభ వేదికగా వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు
- రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ తెలంగాణ ఎంపీల గళం
- 12 ఏళ్లవుతోన్నా హామీల అమలు జరగలేదని మండిపాటు
- హామీల అమలు జాప్యంపై వివరణ ఇవ్వాలని రేణుకా చౌదరి డిమాండ్
- ఆస్తుల పంపకం పూర్తి కాకపోవడంపై ఆందోళన
- ఏపీలో.. తెలంగాణ మండలాల విలీనంపై నిలదీసిన బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో పలువురు ఎంపీలకు వాగ్వాదం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** లోక్‌సభ వేదికగా తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. తెలంగాణ ఏర్పడి 12 ఏండ్లు అవుతోన్నా అమలుకు నోచుకోని రాష్ట్ర విభజన హామీలు.. ఏపీకి కేంద్రం ఇస్తోన్న ప్రాధాన్యతపై తెలంగాణకు చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. గురువారం రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలో విభజన హామీలపై గళమెత్తారు. విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో అమలుకాని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సైతం విభజన సమయంలో కేంద్రం మిగతా 02లో

# మరో 2 లక్షల మందికి చేయూత




09

### పింఛన్ల కోసం బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయింపు

**రాష్ట్ర వ్యాప్తంగా పోటెత్తుతోన్న దరఖాస్తులు, ప్రస్తుతం 42.23 లక్షల పెన్షన్లు**

*తెలంగాణలో సామాజిక భద్రత దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర వ్యాప్తం గా వివిధ వర్గాల ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'చేయూత' పెన్షన్ల మంజూరుకు మోక్షం లభించింది. కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఇందుకోసం 2026-27 బడ్జెట్‌లో రూ. 233 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 42.23 లక్షల మంది పింఛన్లు పొందుతుండగా.. కొత్త లబ్ధిదారుల చేరికతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. పాత దరఖాస్తులతో పాటు గ్రామసభల ద్వారా వస్తున్న కొత్త అప్లికేషన్లను వడపోసి.. అర్హులను ఎంపిక చేసే ప్రక్రియను అధికారులు సవాల్‌గా తీసుకున్నారు.*



**అమరావతి చరిత్ర: 2014**
**రాష్ట్ర విభజన**



ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కొత్త రాజధాని అవసరం ఏర్పడింది. హైదరాబాదును తాత్కాలిక రాజధానిగా నిర్ణయించారు.

# తెలంగాణే ట్రాక్ రికార్డ్

## కేరళలోనూ ఐదు గ్యారంటీలు!



(మొదటి పేజీ తరువాయి)
ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందన్నారు. ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశాన్ని, కేరళంనూ మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోదీ.. విజయన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని సీఎం లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా పినరాయి విజయన్ ప్రభుత్వం కొనసాగుతోందని, అలాగే 2014 నుంచి సుమారు పదేళ్ల పాటు కేసీఆర్ తెలంగాణను పాలించారన్నారు. పినరాయి కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరాయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటుచేసుకుంటుందని సీఎం అన్నారు. పినరాయి విజయ్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. "పో మోనే విజయా" వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, మోదీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని, విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ట వినియోగం, రాష్ట్రానికి రావలసిన నిధుల సాధన.. తమ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని.. అది ప్రజల హక్కు అనే విషయం ప్రజలకు తెలియజేస్తామని సీఎం తెలిపారు. యూడీఎఫ్ కార్మికుల కూటమి అని, కూటమిలో నిజాయితీగల నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు.

**తొలి క్యాబినెట్ నుంచే హామీల అమలు**

కేరళంలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని.. దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.
రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ –2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేపీసీసీ ప్రెసిడెంట్ సన్నీ జోసెఫ్, కేరళ సీఎల్పీ నేత వి.డి.సతీషన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీప్ దాస్ మున్షీ, యూడీఎఫ్ కన్వీనర్ ఆదూర్ ప్రకాష్, ఐయూఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.కె.కున్హాలికుట్టి తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరా ఐదు గ్యారంటీలు..**

కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలోని ఇందిరా ఐదు గ్యారంటీలు

1. కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేఎస్ఆర్టీసీ) బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
2. కాలేజీ చదువుతున్న బాలికలకు నెలకు రూ.1,000 ఆర్థిక సహాయం
3. సంక్షేమ పింఛన్లు నెలకు రూ.3 వేలకు పెంపు
4. మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ పేరుతో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా
5. యువతకు స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు

ఐదు గ్యారంటీలతో పాటు సముద్ర, విమానయాన రంగాలకు సంబంధించి ఐదు డ్రీమ్ ప్రాజెక్టులు, వయనాడ్‌లో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు వాగ్దానాలు ఉన్నాయి.

# మూసీపై ఇక ముందుకే.!

(మొదటి పేజీ తరువాయి)
పటోళ్ల కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. అయితే రాజకీయ దురుద్దేశంతోనే పిటిషనర్ పిటిషన్ వేశారని రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించింది. దీనిపై ఇరు పక్షాల వాదనలు విన్న ఎన్‌జీటీ విచారణ జరిపి.. పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్‌లో సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ.. కేసును డిస్మిస్ చేసింది. పిటిషనర్ చేస్తున్న వాదనలకు సంబంధించి ఎలాంటి సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను సమర్పించలేదని ఎన్జీటీ తెలిపింది. కేవలం



పిటిషనర్ పేర్కొంటున్న అనుమానాలతో మూసీ ప్రాజెక్టును అడ్డుకోలేమని తేల్చి చెప్పింది. అదే సమయంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి.. పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించిన పిటిషనర్.. వాటిని నిరూపించడంలో మాత్రం విఫలమయ్యారని ఎన్జీటీ అభిప్రాయం వ్యక్తం చేస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో మూసీ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురైన న్యాయపరమైన అడ్డంకి తొలగినట్లయింది. గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుతో మూసీ సుందరీకరణ పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. ఇందులో భాగంగా ఇప్పటికే మూసీలో మురుగునీరు కలవకుండా ఎస్టీపీల నిర్మాణం, నది పరివాహక ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, చెక్ డ్యామ్‌ల ఏర్పాటు వంటి పనులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.
రూ. 50వేల కోట్లతో మూసీ సుందరీకరణ..
హైదరాబాద్ నడిబొడ్డున మురుగు నీటితో ప్రవహిస్తున్న మూసీ నదిని దశలవారీగా అభివృద్ధి చేసి, సుందరీకరించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ దాదాపు రూ.50 వేల కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి సంబంధించిన.. తొలి డీపీఆర్‌ను తీసుకొచ్చింది. మూసీ, ఈసా నదులు కలిసే సంగమం వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది. మూసీ నదిని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో 55 కిలోమీటర్ల మేర సుందరీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. తొలి దశలో మూసీ నది అభివృద్ధి పనులకు దాదాపు రూ.7 వేల కోట్లు అవసరమని ప్రభుత్వం అంచనా వేసింది. ఫేజ్–1 కింద 21 కిలోమీటర్ల మేర మూసీ నది ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు.. గండిపేట నుంచి బాపూఘాట్ వరకు గల ఈసా, మూసీ నదులు కలిసే చోటు వరకు అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రణాళికలు రూపొందించింది.

# తెలంగాణపై నిర్లక్ష్యమేల?



(మొదటి పేజీ తరువాయి)
అనాలోచితంగా వ్యవహరించిన తీరును ఎండగట్టే ప్రయత్నం చేసింది. దీంతో కేంద్రం తరుపున తెలంగాణ ఎంపీ కిషన్ రెడ్డి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు గట్టి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయా పార్టీల ఎంపీల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరుకుంది. కాసేపు సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

**12 ఏండ్లు పూర్తయినా..**
**ఆస్తుల పంపకాలు పూర్తి కాలేదు : కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి**

విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే : విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి గుర్తు చేశారు. విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందేనన్న ఆమె ఇప్పటి వరకు హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలన్నారు. 12 ఏళ్ల తర్వాత ఆస్తుల పంపకం పూర్తికాకపోవడం దారుణమన్నారు. ఆస్తుల పంపకంపై రెండు రాష్ట్రాలు సంతృప్తిగా లేవని రేణుకా చౌదరి తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రజలు కవలపిల్లల వంటివారని, కలిసే ముందుకు సాగక తప్పదని అన్నారు. బీజేపీతో సఖ్యతతో ఏపీ కొంతవరకు సాధించుకుంటోందని ఆమె విమర్శించారు. విభజన సమయంలో భద్రాచలంలోని ఏడు మండలాల పరిధిలోని నాలుగైదు గ్రామాలు ఏ రాష్ట్రానికీ చెందకుండా పోయాయని గుర్తు చేశారు. భౌగోళికంగా ఏపీలో ఉన్నా ఆ గ్రామాలు ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్ణీత కాలపరిమితితో విభజన హామీలు అమలు చేయాలని, పారదర్శక విధానంలో విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.1.47 లక్షల కోట్ల విభజన ఆస్తుల పంపకాలు పూర్తికాలేదని తెలిపారు. రెండు రాష్ట్రాలతో కేంద్రం ఆటలాడుతోందని, విభజన హామీలు అమలు చేయనందున 2 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు.

**చర్చించకుండానే విలీనం**

విభజన సమయంలో తెలంగాణ అనుమతి లేకుండానే కేంద్రం కొన్ని మండలాలను ఏపీలో కలిపిందని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు కనీసం చర్చ కూడా జరగలేదని మండిపడ్డారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేకసార్లు అన్నారన్న ఆయన ఏపీ విభజన బిల్లును ఏపీ పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దని డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయలేదని విమర్శించారు. కేంద్రం సహకరించకున్నా తెలంగాణ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. తెలంగాణ నేడు దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా నిలిచిందని గుర్తు చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ చేసిన ఎంతో పోరాటంతో తెలంగాణ సాకారమైందన్న సురేశ్‌రెడ్డి ప్రాంతాలుగా వేరయినా అన్నదమ్ముల్లా కలిసుందాం అని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు.

**సురేశ్ రెడ్డి వర్సెస్ కిషన్ రెడ్డి :**

రాజ్యసభలో కాళేశ్వరం అంశంపై సురేశ్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఆర్‌పాటిల్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం గురించి కేంద్రమంత్రి ఏకపక్షంగా వ్యాఖ్యలు చేశారని సురేశ్‌రెడ్డి తెలిపారు. రూ.లక్ష కోట్లు నదిలో కొట్టుకుపోయాయని కేంద్రమంత్రి మాట్లాడారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం ఒక్క డ్యామ్ మాత్రమే కాదని, ఒక్క డ్యామ్‌లో రెండు పిల్లర్లు మాత్రమే కుంగితే మొత్తం ప్రాజెక్టు వృథా అన్నట్లుగా మాట్లాడారని అన్నారు. తెలంగాణతో పాటు ఏపీ కూడా అభివృద్ధి చెందాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరం ఏపీ వాళ్లతో పాటు ఎంతోమందికి గమ్యస్థానంగా ఉందని పేర్కొన్నారు. మరోవైపు సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని నిపుణుల కమిటీ చెప్పిందని, కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబం ఒక ఏటీఎంగా వాడుకున్నదని విమర్శించారు. కనీసం ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. లక్ష కోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను జైలులో పెడతానన్న రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ఏడు మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారని, దస్త్రాలు పట్టుకుని సోనియాగాంధీ ఇంటికి కేసీఆర్ వెళ్లారని పేర్కొన్నారు.

**మూసీ నది పునరుజ్జీవనానికి తెలంగాణ కట్టుబడి ఉంది:**
**కాంగ్రెస్ ఎంపీ చామల**

తెలంగాణ అభివృద్ధి, అప్పులు, మూసీ పునరుజ్జీవంపై కేంద్ర ప్రభుత్వ తీరును భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తూర్పారబట్టారు. హైదరాబాద్ నగరాభివృద్ధిలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టత ఇచ్చిన ఆయన ఈ ప్రాజెక్టు కోసం ప్రపంచ బ్యాంకు నుండి 500 మిలియన్ డాలర్ల రుణానికి సంబంధించి ప్రిలిమినరీ ప్రపోజల్ రిపోర్టును ఇప్పటికే సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ నివేదికను కేంద్ర సంబంధిత శాఖా మంత్రికి, నీతి ఆయోగ్‌కు సమర్పించామని చెప్పారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించి సహకరించాలని కోరారు.

**బీఆర్ఎస్, బీజేపీలపై ఘాటు విమర్శలు..**

రాష్ట్ర అప్పులపై కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు చామల ఘాటుగా సమాధానమిచ్చారు. "గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేసి దోచుకున్నారు. మరి ఆ పదేళ్లూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? దోపిడీ జరుగుతుంటే చర్యలు తీసుకోకుండా ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు?" అని చామల నిలదీశారు. బీఆర్ఎస్ దోచుకుంటున్నప్పుడు చూస్తూ ఊరుకున్న బీజేపీ, ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడటం సరికాదని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అండగా ఉండాలని ఆయన కోరారు. మూసీ పునరుజ్జీవం, హైదరాబాద్ మెట్రో రెండో దశ, రీజనల్ రింగ్ రోడ్డు వంటి కీలక ప్రాజెక్టుల పూర్తికి కేంద్ర మంత్రులు, ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

**కేంద్రం తెలంగాణకు రూ. 12 లక్షల కోట్లు ఇచ్చింది : ఎంపీ లక్ష్మణ్**

తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ స్పష్టం చేశారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం రూ. 12 లక్షల కోట్లు ఇచ్చిందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేసినందుకు కాంగ్రెస్ పార్టీ బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత జగన్ తీరును చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాజధాని పట్ల పిల్ల కాంగ్రెస్ పిల్ల చేష్టలు చూపించిందని చురకలంటించారు. ఈ చేష్టలు చూసి ప్రపంచం మొత్తం నివ్వెరపోయిందని విమర్శించారు. పిల్ల, తల్లి కాంగ్రెస్‌ను ఏపీ ప్రజలు మట్టికరిపించారని లక్ష్మణ్ గుర్తు చేశారు. రాజధానిని నిర్ణయించే హక్కు రాష్ట్రాలకు ఏ చట్టంలో ఉంది ప్రశ్నిస్తున్నారని, కొత్తగా మావిగన్ అనే పేరు తెరపైకి తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు. రాజధాని కోసం పోరాటం చేసిన రైతులపై జగన్ ప్రభుత్వం కేసులు పెట్టి వేధించిందని మండిపడ్డారు.

# 33 మండలాల్లో సమీకృత భూభారతి

## 45రోజుల తర్వాత రెండోదశ ప్రారంభం

- ప్రతి జిల్లాలోని 70 గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే
- ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్
- వీలైనంత త్వరగా సాదాబైనామాలకు పరిష్కారం
- ఎన్నికల్లో ఫలితాలు చూసినా జ్ఞానోదయం కలగలేదు
- అసెంబ్లీలో టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. 45రోజుల తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో 33 జిల్లాల పరిధిలో ఉన్న మండలాల్లో ఒకటి చొప్పున ఈ పోర్టల్ ను ప్రవేశపెడతామని ప్రకటించారు. రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని మిఠాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. తొలి దశలో అమనగల్ మండలంతో పాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసినట్లు తెలిపారు. ఎవరూ ఏ కార్యాలయానికి... ఏ అధికారి దగ్గరికి వెళ్లకుండా తన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్‌తో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ లో లాగిన్ అయితే అన్నిసేవలు లభిస్తాయన్నారు. గత ప్రభుత్వ పాలకులు ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు దిక్కులేకుండా పోయిందని ఆరోపించారు. వాటిపై దృష్టి సారించినట్లు తెలిపారు. సాగుచేస్తూ, వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకొని వారికే భూమి పట్టాను ఖరారు చేస్తామని మంత్రి తెలిపారు. దీని కోసం వారం రోజుల క్రితం భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని వెల్లడించారు. గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాలిటీగా మారిన ప్రాంతాలకు ఈ సాదాబైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఆధార్ నెంబర్‌లా ప్రతి భూమికి భూధార్ నెంబర్‌ను కేటాయిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 10.984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లు గా విభజించి జీపీవోలను నియమించినట్లు మంత్రి అన్నారు. 5300 మందికి రెండు విడతల్లో ఆరునెలల పాటు శిక్షణ ఇచ్చి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామన్నారు. సర్వే విషయంలో కూడా పాత పద్దతులకు స్వస్తి పలికి ఇప్పటికే 411 రోవర్లతో కచ్చితమైన సర్వే చేయిస్తున్నామని, త్వరలో మరో 400 రోవర్లు రాబోతున్నాయని తెలిపారు.



**టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు**

పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వ పనిచేస్తుంటే గత ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు శాసనసభ సాక్షిగా విషం కక్కారని, టెర్రరిస్టుల్లా ప్రవర్తించారని మంత్రి ధ్వజమెత్తారు. ప్రతి ఎన్నికల్లో ఓడినా జ్ఞానోదయం కాలేదని అన్నారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ పనులు వేగంగా పూర్తి చేయండి

## సీఎం రేవంత్ రెడ్డి

**-ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్ర రాజధాని శివారులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ భవనాలను త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పురోగతిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో 20 ఎకరాల్లో రు.19 కోట్లతో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఏ) కార్యాలయానికి గతేడాది సెప్టెంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పునాది రాయి వేశారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
03.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**అమరావతి చరిత్ర : 2014 – రాజధాని స్థల ఎంపిక**

విజయవాడ–గుంటూరు మధ్య కృష్ణా నది తీరాన్ని రాజధానిగా ఎంపిక చేశారు. భౌగోళికంగా మధ్య ప్రాంతం కావడం ప్రధాన కారణం.



# హైదరాబాద్ బ్రాండ్‌ను దెబ్బతీస్తోన్న సర్కార్

- ప్రభుత్వంపై ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఫైర్
- దోమతెర, ఫాగింగ్ యంత్రంతో అసెంబ్లీలో నిరసన
- అడ్డుకున్న అసెంబ్లీ మార్షల్స్ తో వాగ్వాదం




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తోందని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆరోపించారు. దోమల సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు గుప్పించారు. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి రోగాలతో నగర వాసులు ఆస్పత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన దోమతెర, ఫాగింగ్ యంత్రంతో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ మార్షల్స్ ఆయన్ను అడ్డుకున్నారు. సుధీర్ రెడ్డి వద్ద దోమతెర, ఫాగింగ్ యంత్రం ఉండటంతో వాటిని లోపలికి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే సుధీర్ రెడ్డి జోక్యం చేసుకుని.. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు ఏవీ జరగడం లేదని, అలాంటప్పుడు లోనికి రావొద్దనడానికి కొత్త నిబంధనలు ఏంటని మార్షల్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారిని నెట్టుకుంటూ లోపలికి వెళ్లారు. అక్కడ దోమతెర ధరించి ఆయన మీడియాతో మాట్లాడారు. దోమల బెడదతో నగరవాసులు హైదరాబాద్ నుంచి పారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల బెడద నుంచి నగరవాసులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో నగరంలో చెరువుల్లో, బహిరంగ ప్రదేశాల్లో 4, 5 దశల్లో దోమలను, వాటి గుడ్లు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకునేవాళ్లమని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నగరంలోని ప్రతీ డివిజన్‌కు 10 ఫాగింగ్ మిషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పారదర్శకంగా హ్యామ్ రోడ్ల నిర్మాణం

- హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో పనులు జరుగుతున్నాయి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో కొనసాగుతోన్న అభివృద్ధి, హ్యామ్ రోడ్ల పనుల్లో ఎలాంటి అవినీతి జరగడం లేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపడుతున్న రోడ్డు పనుల విషయంలో జరుగుతోన్న అవినీతి ఆరోపణలను ఖండించారు. హ్యామ్ రోడ్ల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని, అంతా పారదర్శకంగా జరుగుతోందని వివరించారు. ఈ టెండర్లన్నీ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హైవేస్ అథారిటీ నిబంధనల ప్రకారమే ఖరారు చేసినట్లు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. హ్యామ్ రోడ్ల నిర్మాణ విషయంలో ఆరోపణలు చేస్తోన్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి రోడ్ల నిర్మాణం, నిబంధనల గురించి అవగాహన లేదని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. రోడ్ల గురించి, టెండర్ల ప్రక్రియ గురించి ఆయనకు కనీస జ్ఞానం లేదన్నారు. తన రాజకీయ జీవితంలో ఇప్పటి వరకు తనపై ఎలాంటి అవినీతి మరకలు లేవన్నారు. అలాంటిది తన శాఖపై బురద చల్లాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు.

# దక్షిణ మధ్య రైల్వేకు రికార్డు స్థాయి ప్రదర్శన

- ప్రయాణికులు, సరుకు రవాణాలో కొత్త మైలురాళ్లు
- ఆదాయంలో భారీ వృద్ధి



**ముద్ర, సికింద్రాబాద్:**

202526 ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే అన్ని విభాగాల్లో అత్యుత్తమ పనితీరును నమోదు చేసి రికార్డు సృష్టించింది. ప్రయాణికుల రవాణా, సరుకు రవాణా, ఆదాయ వృద్ధి వంటి కీలక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 202627 సంవత్సరానికి రూ.13,026 కోట్ల బడ్జెట్ కేటాయించబడిందని, ఇది గత సంవత్సరం కంటే 18.3 శాతం అధికమని తెలిపారు.

**సరుకు రవాణాలో కొత్త రికార్డు**

ఈ ఆర్థిక సంవత్సరంలో 147.871 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేపట్టి జోన్ చరిత్రలోనే అత్యధిక రికార్డు నమోదు చేసిందని పేర్కొన్నారు. సరుకు రవాణా ద్వారా రూ.13,575 కోట్ల ఆదాయం ఆర్జించడం కూడా ఇదే మొదటిసారి అని చెప్పారు. 2025 26లో మొత్తం 286.44 మిలియన్ ప్రయాణికులను రవాణా చేయగా, ఆదాయం రూ.6,235 కోట్లకు పెరిగిందన్నారు. అదనంగా 3,791 ప్రత్యేక రైళ్లను నడిపి ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపరిచారు. జోన్ స్థూల ఆదాయం రూ.21,211.92 కోట్లకు చేరుకుని కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. రూ.6,000 కోట్ల వ్యయంతో 119 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. ఇందులో తెలంగాణలోని 40 స్టేషన్లు ఉన్నాయన్నారు. వరంగల్, బేగంపేట, కరీంనగర్ స్టేషన్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు వెల్లడించారు.

# ఢిల్లీకి చేరిన గ్రానైట్ స్కాం..

- కరీంనగర్ గ్రానైట్ అక్రమాలపై కేంద్ర సంస్థల దృష్టి
- రంగంలోకి సీబీఐ, ఎన్‌జీటీ, ఈడీ
- రూ.749 కోట్ల రాయల్టీ ఎగవేత
- పీఎంవో దృష్టికి చేరిన స్కాం



**ముద్ర, కరీంనగర్:**

గ్రానైట్‌కు తెలంగాణలో ఖమ్మం తర్వాత కరీంనగర్‌కు మంచి గుర్తింపు ఉంది. ఇక్కడి గ్రానైట్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో ఈ వ్యాపారంగా విస్తరించింది. కరీంనగర్ గ్రానైట్‌కు మంచి డిమాండ్ ఉండడంతో చాలా మంది వ్యాపారులు ఈ రంగంలోకి దిగారు. యూనియన్‌గా ఏర్పడి వ్యాపారం చేస్తున్నారు. అయితే అధికారుల అండతో ఈ వ్యాపారులు అక్రమ మైనింగ్, ఎగుమతులకు తెరలేపారు. దీనిపై కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గతంలోనే సీబీఐకి ఫిర్యాదు చేశారు. రూ.749 కోట్ల సీనరేజీ (రోయల్టీ) నిధుల ఎగవేతతో పాటు రూ.వేల కోట్ల విలువైన అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ కార్యాలయం పీఎంవో దృష్టి సారించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీబీఐ, ఎన్‌జీటీ, జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ విభాగాలకు ఫిర్యాదులు అందడంతో త్వరలోనే కేంద్ర దర్యాప్తు బృందాలు జిల్లాకు రానున్నాయి.

**రూ.వేల కోట్ల అక్రమాలు**

ఈ గ్రానైట్ స్కాం కేవలం చిన్న మొత్తం కాదు.. ఇది భారీ ఎత్తున జరిగిన అక్రమాల సమూహం. రూ.749 కోట్ల రాయల్టీ నిధులు ప్రభుత్వానికి చెల్లించకుండా మోసం చేశారు. రూ.వేల కోట్ల విలువైన గ్రానైట్ అక్రమంగా తవ్వి, అమ్మకం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. విదేశీ మారక ద్రవ్య నిబంధనల (ఫెమా) ఉల్లంఘనపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫిర్యాదులు ఇలా..**

అక్రమాలు, అవినీతిపై ప్రధాని కార్యాలయం దృష్టికి రావడంతో పాటు, ఈ కేసును అనేక కేంద్ర సంస్థలకు ఫిర్యాదు చేశారు. సీబీఐ అవినీతి, అక్రమాలపై దర్యాప్తు చేస్తోంది. ఎన్‌జీటీ కూడా పర్యావరణ నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరుపుతోంది. జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ పన్ను ఎగవేత, ఆర్థిక మోసాలపై విచారణ జరుపుతుంది. ఫెమా ఉల్లంఘనపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.

**ఫెమా ఉల్లంఘన..**

ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం ఫెమా (విదేశీ మారకద్రవ్య నిబంధనల చట్టం) ఉల్లంఘన. గ్రానైట్ ఎగుమతుల ద్వారా వచ్చిన విదేశీ మారకద్రవ్యం సరైన ఛానల్స్ గుండా రాలేదు. విదేశీ ఖాతాల్లో డబ్బు దాచిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది కేవలం రాష్ట్ర స్థాయి నేరం కాదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది.

**అక్రమాల ఆధారాలు..**

తెలంగాణ విజిలెన్స్ శాఖ ఈ కేసుపై సమగ్ర నివేదిక తయారు చేసింది. లైసెన్స్ లేకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా గ్రానైట్ తవ్వకాలు జరిపినట్లు తెలిపింది. వసూలు చేసిన రాయల్టీ నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా దారి మళ్లించారని పేర్కొంది. మైనింగ్ శాఖ, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడించింది. గ్రానైట్ బ్లాకులను అక్రమంగా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు తరలించడంలో రవాణా శాఖ అక్రమాలు చేసినట్లు తెలిపింది.

# దారులన్నీ కొండగట్టుకే...

- వివిధ జిల్లాల నుంచి పాదయాత్రగా కొండగట్టుకు
- కాషాయ మయమైనా అంజన్న క్షేత్రం..
- అంజన్నను దర్శించుకుంటున్న లక్షలాది భక్తులు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

ఆంజనేయస్వామి చిన్న జయంతి సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి కొండగట్టుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎటు చూసినా హనుమాన్ దీక్ష పరులతో దారులన్నీ కొండగట్టు వైపే కనిపించాయి. అంజన్న క్షేత్రం కాషాయ మయమైంది. సుమారు లక్షలకు పైగా మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా హనుమాన్ దీక్షా పరులు కొండగట్టుకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని, మాలవిరమణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. మూడు రోజులపాటు జరిగే ఈ జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం ఆలయ అర్చకులు స్వామి వారికి పూలు, పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. హనుమాన్ దీక్ష పరులు, సాధారణ భక్తులు కాలినడక కొండగట్టు చేరుకొని స్వామివారి దర్శించుకున్నారు.

**జయంతి ఉత్సవాలకు పటిష్ట భద్రత..**

హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నేపథ్యంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం అర్ధరాత్రి పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేస్తూ, పోలీస్ అధికారులకు, సిబ్బందికి వైర్లెస్ సెట్ల ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ అన్ని విభాగాల మధ్య సమన్వయం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మాల విరమణ, దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఆదేశించారు.

**హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు..**

భక్తులకు తక్షణ సాయం అందించేందుకు పోలీస్, రెవెన్యూ, వైద్య శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. కాలినడకన వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మార్గమధ్యంలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి, తాగునీరు, ప్రథమ చికిత్స, మార్గదర్శక సేవలు అందిస్తున్నారు.

**ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు..**

హనుమాన్ దీక్ష తీసుకున్న దీక్షపరులు కాలినడకన కొండగట్టుకు చేరుకునే సమయంలో ముఖ్యంగా రోడ్డు ఇరువైపులా జాగ్రత్తగా నడుస్తూ, వాహనాలను గమనిస్తూ తమ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలో భాగంగా భక్తుల బ్యాగులు, జెండాలు, ఇతర వస్తువులపై రేడియం స్టిక్కర్లను అంటించారు. చీకటి సమయంలో కూడా ఈ రేడియం స్టిక్కర్లు స్పష్టంగా కనిపించడంతో వాహనదారులు దూరం నుంచే భక్తులను గమనించి తమ వాహనాల వేగాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది.

**అసౌకర్యాలతో భక్తుల ఇక్కట్లు..**

కొండగట్టులో చిన్న జయంతి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అయితే భక్తులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, తాగునీరు సరిగా అందకపోవడం, స్నానాలకు కూడా భక్తులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. వేసవి తీవ్రతతో మండే ఎండల వల్ల అప్పటికే పాదయాత్ర చేసి అలసిపోయిన భక్తులకు సరిపడా నీడ లేక ఇబ్బందులు పడ్డారు.



# మానవత్వం చూపించిన కలెక్టర్

- విద్యార్థిని చికిత్సకు పంపి పరామర్శ
- తన వాహనంలోనే పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లిన కలెక్టర్

**మహాదేవపూర్, ముద్ర:**

జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఓ విద్యార్థిపై మానవత్వం చూపించి అండగా నిలిచారు. గురువారం కలెక్టర్ ఘణపురం జెడ్పీ హెచ్ఎస్ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో పరీక్ష రాస్తున్న ఘనపురం మండలం గాంధీనగర్ మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన కీర్తన అనే విద్యార్థిని శ్వాస తీసుకోవడంలతో తీవ్ర ఇబ్బంది పడటాన్ని కలెక్టర్ గుర్తించారు. ఆయన స్పందించి ప్రభుత్వ వాహనంలో తన వ్యక్తిగత సిబ్బందిని వెంట పంపి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం కలెక్టర్ ఆసుపత్రికి వెళ్లి అస్వస్థతకు గురైన విద్యార్థినితో మాట్లాడి ధైర్యం చెప్పారు. అక్కడి నుంచి విద్యార్థిని తన వాహనంలోనే పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. విద్యార్థి విషయంలో కలెక్టర్ స్పందించిన తీరును పలువురు అభినందిస్తున్నారు.

# ఆస్తితో పాటు అమ్మానాన్నల బాగోగులు

- ఆస్తితో పాటు వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణా మీ బాధ్యత
- కుమార్తెలకు హైకోర్టు స్పష్టీకరణ
- సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల వృద్ధురాలి పిటీషన్ పై విచారణ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తల్లిదండ్రుల ఆస్తిలో సమాన హక్కులు కోరుకుంటున్న కుమార్తెలు.. వృద్ధాప్యంలో వారిని సంరక్షించే బాధ్యతను కూడా సమానంగా తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్తి హక్కులతో పాటు బాధ్యతలను కూడా విస్మరించకూడదని స్పష్టం చేసింది. సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. నేటి సమాజంలో వృద్ధ తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న దీన స్థితిపై ఆవేదన వ్యక్తం చేసింది. కేసు వివరాల్లోకి వెళ్తితే.. సూర్యాపేట జిల్లాకు చెందిన సదరు పిటిషనర్ తన కుమారుడు పట్టించుకోవడం లేదని, తన ఆస్తిని తిరిగి ఇచ్చేలా అధికారులు ఇచ్చిన ఆదేశాలను లెక్క చేయటం లేదని కోర్టును ఆశ్రయించింది. 'తల్లిదండ్రుల సంరక్షణ వయోవృద్ధుల సంక్షేమ చట్టం' కింద ఇంటి పత్రాలను, భూమిని తిరిగి ఇవ్వాలని 2025 డిసెంబర్‌లో పిటిషనర్ కుమారుకి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. ఆ ఉత్తర్వులను కుమారుడు బేఖాతరు చేయటమే కాకుండా.. తనను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆమె వాపోయింది. ప్రస్తుతం తాను కుమార్తె వద్ద ఉంటున్నానని పిటిషన్‌లో పేర్కొంది. ఈ విచారణ సందర్భంగా జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి సమాజంలోని పోకడలను ఎత్తి చూపారు. ప్రస్తుతం కోర్టుల్లో వృద్ధ తల్లిదండ్రులు తమ కుమారులు, కోడళ్లను ఆస్తుల నుంచి గెంటివేయాలని కోరుతూ దాఖలు చేసే పిటిషన్లు వెల్లువలా వస్తున్నాయని చెప్పారు. ప్రతిరోజూ కనీసం రెండు వరకు ఇలాంటి పిటిషన్లు విచారణకు వస్తున్నాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే రాజీ మార్గాలు వెతకాలన్నారు. ఆస్తి నుంచి వెలివేయడం అనేది చివరి ప్రయత్నంగా ఉండాలని.. కానీ బాధితులు మొదటి దశలోనే ఆ విజ్ఞప్తి చేస్తున్నారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ముఖ్యంగా కుమార్తెల బాధ్యత గురించి ప్రస్తావిస్తూ.. కేవలం కుమారులు లేని వారే కాదు, కుమార్తెలు ఉన్న వారు కూడా వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నారని కోర్టు అభిప్రాయపడింది. చాలా సందర్భాల్లో కుమార్తెలు తల్లిదండ్రుల ఆస్తిపై హక్కులు కోరుకుంటున్నారు కానీ, వారిని సంరక్షించే విషయంలో వెనకాడుతున్నారన్నారు. కేవలం కుమార్తెలు మాత్రమే ఉన్న తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటని కోర్టు ప్రశ్నించింది. కుమార్తెలు కచ్చితంగా బాధ్యత వహించాలని స్పష్టం చేశింది. ఆస్తిలో వాటా అడిగే ప్రతి కుమార్తె, తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాల్సిన నైతిక, చట్టపరమైన బాధ్యతను కలిగి ఉంటుందని గుర్తు చేశారు. విచారణ సందర్భంగా కోదాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో పోలీసు, పరిపాలనా యంత్రాంగం విఫలమైందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. అధికారులు పట్టించుకోకపోవటం పిటిషనర్ హక్కులను ఉల్లంఘించడమేనని న్యాయమూర్తి కోర్టుకు విన్నవించింది. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. పిటిషనర్ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని సూర్యాపేట జిల్లా అధికారులను ఆదేశించారు.. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేశారు.


మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com


## పరమ పవిత్రం... త్యాగ నిరతికి శాశ్వత చిహ్నం

# 'శుభ శుక్రవారం'




మానవాళి పాప విమోచన కోసం తన ప్రాణాన్ని అర్పించిన యేసు క్రీస్తు శిలువ మరణాన్ని స్మరించుకునే పవిత్ర దినమే 'గుడ్ ఫ్రైడే'. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు దీన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఇది కేవలం విషాదం కాదు; త్యాగం, క్షమ, ప్రేమకు ప్రతీక.

ప్రాచీన యూద మతంలో ఆచారాలు సంక్లిష్టమై, ఆత్మీయత తగ్గిన కాలంలో యేసు క్రీస్తు జన్మించారు. ఆయన ప్రేమ, కరుణ, సమానత్వం బోధిస్తూ అణగారిన వర్గాలకు ఆశగా నిలిచారు. "పాపాన్ని ద్వేషించు, పాపిని కాదు" అనే సందేశంతో మానవతా విలువలను ప్రచారం చేశారు.

ఆయన బోధనలు ప్రజాదరణ పొందడంతో అప్పటి మత, రాజకీయ వర్గాలకు సవాలుగా మారాయి. చివరకు క్రీశ 30-33 ప్రాంతంలో ఆయనను అరెస్టు చేసి, శిలువ వేయించారు. తీవ్రమైన వేదనలో కూడా "తండ్రీ, వీరిని క్షమించు" అని ప్రార్థించడం ఆయన క్షమాగుణాన్ని చూపింది.

శిలువ మరణం అవమానకరమైనదైనా, మానవ విమోచనకు మార్గం అన్న విశ్వాసంతో దీనిని 'గుడ్ ఫ్రైడే'గా పిలుస్తారు. బాధ ద్వారానే విమోచనం సాధ్యమని ఈ రోజు సూచిస్తుంది.

గుడ్ ఫ్రైడేకు ముందు 'లెంట్' అనే ఉపవాస కాలం ఉంటుంది. ఈ సమయంలో ఆత్మపరిశీలన, ప్రార్థనలు చేస్తారు. గుడ్ ఫ్రైడే రోజున చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, మౌన ఆరాధనలు జరుగుతాయి. శుభకార్యాలు నివారిస్తారు.

యేసు మరణంతో కథ ముగియలేదు. మూడవ రోజు ఆయన పునరుత్థానం పొందినట్లు విశ్వసిస్తారు. దీనినే ఈస్టర్‌గా జరుపుకుంటారు. ఇది ఆశ, నూతన జీవితం సంకేతం.


ప్రపంచంలో కోట్లాది మంది క్రైస్తవులు ఉన్నారు. యేసు బోధించిన ప్రేమ, శాంతి, సేవా తత్త్వాలు మానవ సమాజంపై గాఢ ప్రభావం చూపాయి. విద్య, వైద్య రంగాల్లో క్రైస్తవ మిషనరీల సేవలు విశేషం.

యేసు కేవలం మత గురువు మాత్రమే కాదు; శాంతి దూత, సమాజ సంస్కర్త. "నీ పొరుగువానిని నీవలె ప్రేమించు" అనే సందేశం నేటికీ ప్రాసంగికం.

శుభ శుక్రవారం మనకు చెప్పే సందేశం స్పష్టమైనది.. త్యాగం, ప్రేమ, క్షమ ద్వారానే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. ఈ విలువలను ఆచరిస్తేనే ఆయనకు నిజమైన నివాళి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# తెలంగాణ సాయుధ పోరాట జ్వాల దొడ్డి కొమురయ్య



నిజాం నిరంకుశత్వాన్ని, దొరల దాష్టీకాలను మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. 'బాంచెన్ దొరా నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమెందించారు. వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందాయి.తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర అనగానే మొట్టమొదటగా స్ఫురించే విప్లవ జ్వాల దొడ్డి కొమురయ్య. అందువలన తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభం 'భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం' అనే నినాదాలుగా మారుమోగి ఉద్యమం సాయుధ పోరాటంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వమే ప్రధాన కారణం అని చెప్పవచ్చు. జనగామ జిల్లా లోని కడివెండి గ్రామంలో కురుమ కులానికి చెందిన గొర్రెల కాపరుల కుటుంబములో దొడ్డి కొమురయ్య 1927 ఏప్రిల్ 3 నాడు జన్మించాడు.

తెలంగాణలో భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య. విస్నూర్ గ్రామంలోని దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి ప్రజల పట్ల అతి క్రూరంగా వ్యవహరించేవారు. ఆయన తల్లి జానకమ్మ దొరసాని కడివెండి గ్రామంలో ఉండి ప్రజల చేత 'దొరసాని' అని పిలిపించుకునేది. ఆమె కడివెండి గ్రామాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకొని ప్రజానీకం పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించేవారు. అలాగే నిజాంకు తొత్తులుగా ఉన్న దొరలు, భూస్వాములు ప్రజలపై జులుం చెలాయించేవారు.

ఈ అణచివేతలని ఎదుర్కోవడానికి 1944 భువనగిరి ఆంధ్ర మహాసభ ఆశాకిరణంగా నిలిచింది. దొరలు భూస్వాములు కొనసాగిస్తున్న దోపిడి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆరుట్ల రాంచంద్రారెడ్డి కడివెండి గ్రామ ప్రజలకి చైతన్యాన్ని రగిలించారు. గొల్ల, కురుమల నాయకుడు గాను, ఆంధ్ర మహాసభలో సభ్యుడిగాను ఉన్న తన అన్న దొడ్డి మల్లయ్య ప్రభావంతో దొడ్డి కొమురయ్య ఆ సంఘంలో చేరి దొరలకు వ్యతిరేకంగా పోరాడాడు. తెలంగాణ ప్రాంతం అంతా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో సంఘాన్ని ఏర్పరుచుకొని వెట్టిచాకిరి రద్దు కోసం ఉద్యమబాట పట్టింది. దీనిని సహించని దొరలు ఉద్యమాన్ని అణచడం కోసం అనేక పన్నాగాలు పన్నారు.



వందలాది మంది ప్రజలు రైతులు సంఘం పిలుపు అందుకొని 1946 జూలై 4 సాయంత్రం కడివెండి గ్రామంలో దొడ్డి మల్లయ్య నేతృత్వంలో ఊరేగింపుతో బయలుదేరారు. విస్నూరు రామచంద్రారెడ్డి రౌడీలు 40 మంది ఎలాంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో దొడ్డి కొమురయ్య కడుపులోకి తూటా దిగడంతో ఆయన కుప్పకూలి 'ఆంధ్రమహాసభకు జై', 'కమ్యూనిస్టు పార్టీకి జై' అని నినదిస్తూ వీర మరణం పొందాడు. తెలంగాణ రైతాంగ పోరాటంలో అమరుడైన తొలి వ్యక్తిగా దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

దొడ్డి కొమురయ్య మరణ వార్తతో చుట్టుపక్కల గల గ్రామాల ప్రజలంతా ఆవేశపూరితులై కడివెండి గ్రామానికి చేరుకుని ప్రతీకార చర్యలలో భాగంగా కర్రలు, బడిశెలు, గునపాలు అందుకుని దొర గూండాలను తరిమి కొట్టారు. దొడ్డి కొమురయ్య బలి దానం తెలంగాణ సాయుధ పోరాటానికి ఆజ్యం పోసింది. క్రమంగా సంఘం పిలుపుతో ప్రజలు సాయుధ మార్గం దిశగా ఉద్యుక్తులు అయ్యారు. ఆ రకంగా దొడ్డి కొమురయ్య హత్యతో శాంతియుతంగా సాగుతున్న రైతాంగ ఉద్యమం సాయుధ విప్లవోద్యమంగా మారింది. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడుగా ప్రజా హృదయాలలో చిరస్మరణీయమైన స్థానాన్ని పదిలపరచుకున్న దొడ్డి కొమురయ్య జయంతి (ఏప్రిల్ 3) మరియు వర్ధంతి (జూలై 4) లను అధికారికంగా నిర్వహించడానికి తెలంగాణ ప్రభుత్వం 2023 ఏప్రిల్ 2 నాడు ఉత్తర్వులు జారీ చేసి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతుండడాన్ని 'ప్రజా పోరాటాల విజయాలను సమున్నతంగా ఎత్తిపడుతుంది' అని సగర్వంగా చెప్పవచ్చు. అదేవిధంగా జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరుని పెట్టాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా**
**( ఏప్రిల్ 3 దొడ్డి కొమురయ్య జయంతి )**
**9848445134**



# యుద్ధ వినాశనం

యుద్ధం
విషాదాలు, విలాపాల వలపోత
కన్నీరింకిన కళ్ళల్లో ఎండు చేపల్లాంటి చూపులు
చుట్టుముట్టి బీభత్సం సృష్టించిన తుఫాన్ నయం
కొంప గోడు మనుషుల ఆనవాళ్లైనా మిగులుతా
యియుద్ధం మిగిల్చే నిశ్శబ్దంలో భస్మీపటలమైన ఆశలు
మనుషులు, దేశాలు కన్న కలలు
కన్నీళ్ల వాగులానైనా మిగులవు
బడికి వెళ్లిన పిల్లలు తిరిగొస్తారో లేదో
ఆసుపత్రికి వెళ్లిన ఆత్మ బంధువుల శవాలెక్కడో
కన్న బిడ్డల జాడ కోసం తల్లులు, తండ్రులు
కన్న వారి కోసం చిన్నారులు
ఎదురుచూపుల గాలానికి దక్కుతాయా ఆనవాళ్లు
చెమటోడ్చి కట్టుకున్న ఇంటి ఇటుకలైనా మిగులుతాయా
బంకర్లలో తలదాచుకున్న ఆయువులకు
బుక్కెడు బువ్వైనా దక్కుతుందా
యుద్ధం మిగిల్చే నిశ్శబ్దం రేపిన ప్రశ్నలు

యుద్ధమంటే లెక్కలు మారాయి నేడు
తనకు లొంగని దేశాలన్నీ శత్రువులే ట్రంపరికి
పెద్దన్నది గద్దల జాతి పెద్దరికం
రాజును చంపితే రాజ్యం హస్తగతమైతుందనుకొని
తప్పుడు అడుసులో కాలేసి కడుక్కోలేక సతమతం
అమెరికా పెత్తనానికి కొత్త యుద్ధ రీతులు నేర్పిన ఇరాన్
యుద్ధానికి విరామం ప్రకటన ఉత్తదే
నాలుక మడ్లేయడంలో దిట్ట పెద్దన్న
ఆయిల్ ఖజానాలను సొంతం చేసుకోవడానికి
కన్న కలలు కల్లలవుతున్నాయన్న ఆందోళన
గెలుపు దక్కలేదన్న ఆక్రోషం
నాటో దేశాలు కలిసి రాలేదన్న దుగ్ధ
నెల దాటి రోజులు గడుస్తున్న కొద్దీ
ఇరాన్, ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాలలో ఆస్తుల విధ్వంసం
బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న విమానాశ్రయాలు
బాంబుల మోతతో తోలడానికి ఈగలు లేవక్కడ


హోర్ముజ్ జలసంధి మూసివేత దెబ్బ
ప్రపంచం పేగులు తెగినట్లు అరుస్తోంది ఆయిల్ కొరతతో
గ్యాస్ కొరతతో గగ్గోలు
మందుల ముడి సరుకులకు ముప్పు
క్రమంగా డేటా సెంటర్లు ధ్వంసం
ఏవి ధరల దప్పు కొడతాయో చెప్పలేని స్థితి

డ్రోన్లు, బాంబులు, మిస్సైళ్లది ఊహించని దూరం
పడ్డచోటల్లా పరిణామాలు బూడిద గుట్టలు
ట్రంపరి అత్యాశను ప్రశ్నించే నోళ్లు లేకపోవడం విషాదం
అదీ ఒక నేరానికి భజన చేయడమే
యుద్ధ పరిణామాలు ఎంతో విపత్కరం
సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న లోకం
యుద్ధం సృజిస్తున్న వినాశనం గురించి
ఎంత చెప్పినా తక్కువే, తక్కువే

**కొమురవెల్లి అంజయ్య**
**సిద్దిపేట**
**సెల్..9848005676**



# మంగలుల అస్తిత్వపు జీవధార "అసిపె"




కవిత్వం ఒక హృదయ భాష. విభిన్న ఆలోచనల ధారావాహిక. సామాజిక సంఘటనల స్పందన. ఎంతటి కఠినమైనా హృదయాన్ని అయిన చటుక్కున తట్టి లేపే అక్షరాకృతి. "కాదేదీ కవితకు కనర్హం.... ప్రపంచం ఒక పద్మ వ్యూహం కవిత్వం ఒక తీరని దాహం"(మహాప్రస్థానం ;శ్రీ శ్రీ ..పుట సం .38) సృష్టిలో ప్రతి వస్తువుపై దృష్టి సారిస్తే అద్భుతమైన కవిత్వాన్ని అక్షరీకరించవొచ్చని భావించిన కవులు భిన్న కోణాల్లో కవిత్వం రాస్తున్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో నయా కవులు తమ చుట్టూ వున్న పరిస్థితులను వస్తువుగా స్వీకరించి అందమైన శిల్పాలను చెక్కుతున్నారు. ఒక్కొక్కరు ఒక్కో తాత్విక స్పర్శను, అస్తిత్వ ఆవేదనను, సామాజిక సమస్యలను ఎక్కు పెట్టి కవిత్వాలు అల్లుతున్నారు. తమ సామాజిక నేపథ్యం, స్వయంగా అనుభవించిన అనుభవాల ఆలోచనలే కవిత్వపు విత్తనమై పురుడోసుకున్నాయి. నేటి యువ కవులు సామాజిక చైతన్యం పురికొల్పుటకై వివిధ ప్రక్రియలను ఆయుధంగా మలుచుకున్నారు. వాటిలో కథలు, నవలలు, కవిత్వాలు, లఘు ప్రక్రియలెన్నో తమ ఆలోచనల కలానికి సిరా సమీరం అయినాయి. వచన కవిత్వం ఆధునిక తెలుగు సాహిత్యాన్ని అద్భుతమైన భావసౌందర్యంతో ఛందస్సు సంబంధం లేకుండా స్వేచ్ఛగా వ్యక్తపరిచే సాహిత్య ప్రక్రియ. వచన కవితలో భాగమే దీర్ఘకవిత. సాహిత్యానుసరణలో చాలా విశిష్టమైనది. ఆంగ్లంలో "long poem" అంటాం. ఒకే అంశంపై గాఢమైన స్పర్శతో, ఏక వస్తువును స్వీకరించి, భావ తీవ్రత, భాషాసారళ్యం, వచనత్వం, సుదీర్ఘత , ప్రవాహగుణం, పాఠకుని హృదయాన్ని నిక్షిప్తం చేసే ఆధునిక ప్రక్రియ. దీర్ఘ కవితలు రాయడం అంత సులువేం కాదు. సవాలుతో కూడినది. కవి ఒక్క వస్తువును కేంద్రం చేస్కోని వాటి చుట్టూ అల్లుకున్న పరిస్థితులన్నింటిని క్రమపద్ధతిలో ప్రతిష్టించడం సాహసమే అని చెప్పాలి. ఒక విషయాన్ని విస్తృతంగా చెప్పే తపన, కవుల మేధస్సుకు సమన్వయాత్మక గీటురాయి లాంటిది. అలాంటి దీర్ఘకవితలు ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక మైలు రాయిగా కనపడుతాయి. నగ్నముని గారు "దీర్ఘకవితకు వస్తువు ప్రాణం. రూపం విధానం. ప్రాణాయామంతో సమానం. అది తాడు మీద నడకలాంటిది. తడపడితే లోయే "(వికీపీడియా) ఈ ఒక్క నిర్వచనం దీర్ఘకవిత స్వరూప స్వభావ చిత్రణ అర్థం అవుతుంది. తెలంగాణ సాహిత్యంలో కూడ దీనిని ఒక మహోత్తర ప్రక్రియగా తీర్చి దిద్ది అస్తిత్వ ఆవేశాన్ని ఇక్కడి కవులు అక్షరబద్ధం చేశారు. వారిలో ముందు వరుసలో వున్నవారు కవిరాజ మూర్తి ( మహైక), సినారె (విశ్వంభర), గోపిగారి (జలగీతం), నగ్నముని (కొయ్యగుర్రం), వరవరరావు (సముద్రం), ఎండ్లూరి (కొత్తగబ్బిలం), జూలూరి గౌరి శంకర్ (పాదముద్ర), బన్నఅయిలయ్య (నిప్పుకణిక), పసునూరి రవీందర్ (లడాయి)...ఇలాంటి దీర్ఘకవితలెన్నో మనకు కనపడుతాయి. ఆ కోవలో దశాబ్దాల అస్తిత్వ అక్షరానికి ఆవేశాన్ని తొడిగి బహుజన బావుటతో వర్తమాన కాలానికి సందేశాత్మక దీర్ఘకవితలందించిన కవి, రచయిత, విమర్శకుడు, తెలంగాణ ఉద్యమ నేత వనపట్ల సుబ్బయ్యగారు.

పాలమూరు పల్లెలో నుంచి పరివ్యాప్తి చెంది తెలంగాణ ఉద్యమ సాహిత్యానికి ఎన్నో దీర్ఘకవితలు అందించిన కవి. సాధికారిక కవిత్వాన్ని అందిస్తూ, అస్తిత్వ మూలాలను వెతుకుతాడు. పాలమూరు భాషా, మట్టిపరిమలాల యాసతో గుండె లోతులను తడుపుతాడు. సజీవ వాస్తవాలను కుండబద్దలు కొట్టినట్లు కవిత్వాలతో ఎక్కు పెట్టడం ఆయన నైజం. బహుజన అస్తిత్వ వేటలో సామాజిక న్యాయం, సమపాలన , తాత్విక కోణాలలో తమ కలానికి రంగులద్దుతాడు. ఒక వైపు వృత్తి జీవనం కొనసాగిస్తూ, మరో వైపు ప్రవృత్తిగా సాహిత్య వనంలో జలధారలా రాణిస్తున్నారు. ఆయన కలం నుంచి జాలువారిన కవితలన్నింటిలో సామాజిక సమస్యలు, ప్రాంతీయ అస్తిత్వపు అన్వేషణ, బహుజన వాదం, వృత్తి జీవుల వెతలు, ఎన్నో తెలంగాణ సాంస్కృతిక అంశాలు, కరోన సంక్షోభ పరిస్తితులను, సబ్బండ వర్గాల ప్రస్థానం, గ్రామీణ ప్రాంత ప్రజల హావభావాలు , ఉత్పత్తి వర్గాల దుస్థితి కళ్ళకు కట్టినట్లు దర్శనమిస్తాయి. "వొల్లెడ"తో ప్రారంభం అయిన ఈ కవిప్రస్థానం గుప్పున పొగను వెదజల్లే "మశాల్" ఉద్యమ కవిత్వాన్ని చిత్రీకరిస్తారు. యావత్ తెలంగాణ గ్రామ ప్రజలకు జీవనాధారం చెరువు ఆ చెరువుల పై "ఊరచెరువు". కులవృత్తి పై "కుర్చీ" , తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్ పై "జనశంకరుడు", తడి, సెల్ఫ్ లోక్ డౌన్, అలయ్ బలయ్, మా అక్షరం ఆయుధం, బహుజన బావుటా, బుద్ధగీతం తో పాటు "అసిపె" అనే మగలుల ఆత్మ గౌరవ ప్రతీకతో ప్రతిధ్వనించారు.

**-కంచర్ల మహేష్**
**తెలుగు అధ్యాపకులు**
**ప్రభుత్వ జూనియర్ కళాశాల**
**హుజూర్నగర్**
**6300489220**






# కలువరి గిరిపై కరుణా కిరణం!!*

నిలువెత్తు సాక్ష్యమై.. నిలిచావు సిలువపై,
లోక పాపపు భారమంతా.. మోశావు నీ భుజముపై!
ముళ్ల కిరీటము నీ నుదుట.. మాణిక్యపు మకుటమై,
చిమ్మిన రక్తధారలు.. మా బతుకులకు రక్షణ కవచమై!
అరికాళ్ళ నుండి నడినెత్తి వరకు..
గాయాల గాథలు,
అయినా నీ పెదవులపై.. అలుపెరగని క్షమా గుణాలు!
"తండ్రీ! వీరిని క్షమించు" అన్న ఆ దీన హృదయం,
మరుజన్మ లేని మనిషికి.. మరణాన్ని గెలిచిన మహోదయం!
కొరడా దెబ్బల శబ్దాలలో.. వినిపించెను విముక్తి నాదం,
మేకులతో కొట్టిన చేతులలో..
కనిపించెను లోక క్షేమం!
అవమానపు అంచున నిలిచి..
అపజయమే లేదన్నావు,
మరణపు లోయలో నడిచి..
అమరత్వాన్ని ఇచ్చావు!
నీ త్యాగమే మా ఊపిరి.. నీ రక్తమే మా శుద్ధి,
నీ సిలువ నీడలో చేరడమే.. మాకున్న పరమ సిద్ధి!
ఓ త్యాగమూర్తీ.. ఓ కరుణా సింధూ..
ఈ గుడ్ ఫ్రైడే సాక్షిగా.. నీకే మా హృదయ వందనం!

**-జయశ్రీ**

**అమరావతి చరిత్ర : 2015 – అమరావతి పేరు ప్రకటన**

ప్రాచీన చరిత్రకు గుర్తుగా "అమరావతి" పేరును ప్రకటించారు. సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా నిర్ణయం తీసుకున్నారు.

# అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరాలి

- **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

సంక్షేమ పథకాలు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం వికారాబాద్ నియోజకవర్గం మోమిన్ పేట్ మండలం బూర్గుపల్లి గ్రామంలో జరిగిన గ్రామ సభలో గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేస్తుందన్నారు. రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన విధంగా గ్రామంలో ఇళ్ళు లేని అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని అన్నారు. ఎండాకాలంలో గ్రామాలలో నీటి ఎద్దడి సమస్యలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

**విలేజ్ ల్యాండ్ రీసర్వే ప్రారంభం :**

మోమిన్ పేట్ మండలం అమ్రాది కలాన్ గ్రామంలో విలేజ్ ల్యాండ్ రీసర్వేను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. నిజాం నవాబుల కాలంలో భూముల సర్వే జరిగిందని, మళ్ళీ తొంభై ఏళ్ళ తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో భూముల రీ సర్వే ఇప్పుడు జరుగుతుందని అన్నారు. సర్వేకు గ్రామస్తులు అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్ డి ఓ వాసుచంద్ర, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులులతో కలిసి కార్యక్రంలో పాల్గొన్నారు.



# సలేశ్వరం జాతర ప్రారంభం

- **భక్తుల రద్దీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సలేశ్వరం లింగమయ్య స్వామి జాతర బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ క్షేత్రస్థాయిలో పర్యటించి జాతర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం జరిగే ఈ జాతరకు తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారని, దీనికి జిల్లా యంత్రాంగం ముందస్తుగా విస్తృత ఏర్పాట్లు చేపట్టిందన్నారు. వైద్య సేవల పరంగా మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సదుపాయాలు సిద్ధంగా ఉంచి, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేస్తూ ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి తదితర అధికారులు పాల్గొన్నారు.



## హిందూ సమ్మేళనానికి తరలిరండి

**ముద్ర, నారాయణ పేట :**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని సరాఫ్ బజార్ బసవేశ్వర స్వామి దేవాలయ వద్ద , అంబ భవాని దేవాలయం వద్ద శ్రీ సరస్వతి ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే హిందూ సమ్మేళన కార్యక్రమానికి తరలి రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించి ఆయా బస్తీల్లో ఇప్పటికే కరపత్రాల పంపిణీ చేశామని అన్నారు. బస్తీల నుంచి హిందూ సంస్కృతి సాంప్రదాయాలు ఆధ్యాత్మిక తను పెంపొందించే భజన సంకీర్తనలతో కోలాట ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలతో హిందూ సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యేలా హిందూ సమ్మేళన సమితి ఉత్సవ కమిటీ కార్యాచరణ రూపొందించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అన్ని బస్తీల నుంచి మహిళలు, యువత, విద్యార్థులు, మేధావులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా హిందూ ధర్మ పరిరక్షణకై కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.



## ఘనంగా ప్రజా పాలన

**ముద్ర, పెబ్బేరు :**

శ్రీరంగాపూర్ మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి వార్డు సభలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వరలక్ష్మి ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించారు. గ్రామంలో రైతు రుణ మాఫీ పొందిన లబ్ధిదారులు, జరిగిన రుణ మాఫీ మొత్తం, రైతు భరోసా, వరి ధాన్యం సేకరణ చెల్లించిన నగదు, మొత్తం రేషన్ కార్డులు, కొత్తగా మంజూరు చేసిన రేషన్ కార్డులు, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు, ఇంకా మంజూరు చేయాల్సి ఉన్న వివరాలు, స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన వడ్డీ లేని రుణాలు, చేయూత పెన్షన్ల లబ్ధిదారులు, ఉచిత చీరల పంపిణీ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించిన పని దినాలు, మంజూరు అయిన వేతనం, చేపట్టిన పనులు, అంచనా విలువ తదితర అంశాలను లబ్ధిదారుల పేర్లతో సహా చదివి వినిపించారు. ప్రభుత్వం త్వరలో ప్రతి పేద కుటుంబానికి 5 లక్షల ఇందిరమ్మ జీవిత భీమా కల్పించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ భరత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఏఈఓ అనూష, వార్డు సభ్యులు విష్ణు, రాముడు, ఉమా, సుష్మ, కవిత, కల్పన పాల్గొన్నారు.

## ప్రజా పాలన సభ విజయవంతం

**ముద్ర, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా పాలన - పట్టణ ప్రగతి 99 రోజుల పాలనలో భాగంగా 22వ వార్డులోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో 6, 22, 23వ 21వార్డులు మరియు 18వ వార్డుకు సంబంధించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక వార్డ్ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, స్థానిక మౌలిక సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు.



## ధైర్యసాహసాలకు ప్రతీక సర్వాయి పాపన్న

- **ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్ :**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సర్దార్ స్వరాయి పాపన్న గౌడ్ గారి 316వ వర్ధంతి సందర్భంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు. ఆయన చూపిన ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ పాపన్న గౌడ్ గారి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మాజీ ఎమ్మెల్యే మోహన్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పకిరాయ గౌడ్, జిల్లా అధ్యక్షుడు మల్లయ్య గౌడ్, వెంకటయ్య గౌడ్, నారాయణ గౌడ్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి పెద్దపీట

- **ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో మహిళలు భారీగా ప్రయోజనం పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కీలక పాత్ర పోషించిందని, ప్రస్తుతం ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు ఆదా చేసిన డబ్బును ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించడం వల్ల సంస్థకు నూతన జీవం లభించిందని వివరించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు రూ.8.98 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని వెల్లడించారు. అలాగే నారాయణపేట జిల్లా మహిళలు రోజుకు రూ.41.79 లక్షల వరకు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు ఉచిత బస్సు ప్రయాణంపై అవహేళనగా మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, ఆర్టీఏ సభ్యుడు గోపాల్ రెడ్డి, డీటీఓ, డిపో మేనేజర్, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.




# గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి :**

గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులే కాక ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గద్వాల మండలం చేనుగోనుపల్లిలో జరిగిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. గ్రామంలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధిదారుల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, మండల ప్రత్యేక అధికారి నూకరాజు, డీఎల్ పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రకళ, హౌసింగ్ డీఈ కాశీనాథ్, ఉప సర్పంచ్ రాముడు, పంచాయతీ కార్యదర్శి రామ నర్సింహులు, వివిధ శాఖల ఇతర అధికారులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.




# సర్వాయి పాపన్న ఆశయాలు సాధించాలి

- **ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా స్థానిక గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, నాయకులు మైత్రి యాదయ్య, ఆంజనేయులు, అంజి, బీసీ సంక్షేమ అధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారం :**

పాత పాలమూరు, 10 వ డివిజన్ లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం దశల వారీగా పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.

**నైపుణ్య శిక్షణ కేంద్రం సందర్శన :**

మహబూబ్ నగర్ మెట్టు గడ్డలో ఉన్న ఎటిసి సెంటర్‌ను యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎటిసి సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడి శిక్షణ విధానం, వసతులు తదితర అంశాలపై వివరంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, శ్రీరామ జయరామ మోటార్స్ ఎండీ బెక్కెరి రామిరెడ్డి, మారుతి కార్స్ సిఇఓ విక్రం యాదవ్, ఎటిసి సెంటర్ ప్రిన్సిపాల్ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ పాఠశాలలో డీఈఓ తనిఖీ

**ముద్ర, గద్వాల:**

ధరూర్ మండలం మార్లబీడు కాంప్లెక్స్ పరిధిలోని చెన్నారెడ్డి పల్లె ప్రాథమిక పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, పరి సరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## విద్యార్థినులకు స్కాలర్ షిప్ లు మంజూరు

**ముద్ర, గద్వాల:**

ఉన్నత విద్యలో బాలికలను ప్రోత్సహించడానికి అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ప్రత్యేక స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రారంభించిందని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. మీనాక్షి అన్నారు. 20252026 సంవత్సరానికి అజీజ్ ప్రేమ్ జీ స్కాలర్ షిప్ కు దరఖాస్తు చేసుకున్న 11 మంది విద్యార్థినులకు స్కాలర్ షిప్ లు మంజూరయిన సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులను అభినందించారు. మొత్తం 25 మంది విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోగా, 11 మందిని ఎంపిక చేశామని, ఒక్కో విద్యార్థినికి రూ.30,000 స్కాలర్ షిప్ మంజూరు చేశామన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు ఉన్నత విద్యను అభ్యసించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



## జాతీయ రహదారుల నిర్మాణాలకు డీపీఆర్ ఆమోదించాలి

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంగా జాతీయ రహదారుల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణ గురువారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పాలమూర ఎంపీ డీకే అరుణ భేటీ అయ్యారు. ఇరిగేషన్ పరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న గద్వాల జిల్లా ప్రాంతంలో ఎర్రవల్లి - గద్వాల్ - రాయచూర్ రహదారి (67 కి.మీ), కొత్త కోట - గద్వాల్ - మంత్రాలయం రహదారి (90 కి.మీ) రెండు గ్రీన్ ఫీల్డ్ రహదారులు ఎంతో అవసరమని పాలమూరు ఎంపీ డికె అరుణ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి తెలియజేస్తూ వెంటనే వాటికి ఆమోదం ఇవ్వాలని వినతిపత్రాన్ని అందజేశారు. 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగకూడా మద్దతు తెలిపారు అని వెంటనే కేంద్రప్రభుత్వం చొరవ తీసుకుని రహదారుల నిర్మాణాలకు డీపీఆర్ అమోదించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు ఆమె వెల్లడించారు.





## సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- **తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి**

**ముద్ర, తాండూర్ :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా తాండూర్ నియోజకవర్గంలోని గౌతాపూర్ గ్రామంలో సర్పంచ్ జన్నె సుజనా అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల నివేదికను ఆయా శాఖల అధికారులు గ్రామ సభలో వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని శాఖల అధికారులను గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అందరిని సమన్వయం చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చక్కటి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను దశల వారీగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏ సి యు టి హర్ష సుధీర్ చౌదరి, ఆర్డీవో అనిత, మండల స్పెషల్ ఆఫీసర్ సత్తార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, మండల పార్టీ ప్రెసిడెంట్ నాగప్ప, వివిధ శాఖల అధికారులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విజయ పాల ధరలు పెంపు

**ముద్ర, హైదరాబాద్:**

కృష్ణా మిల్క్ యూనియన్ (విజయా డెయిరీ) పాల ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఏడు రకాల పాలపై లీటరుకు రూ.2 పెంచారు. పెరుగు బకెట్లపై రూ.10 నుంచి రూ.30 వరకు పెంచారు. ఒక స్టాండర్డ్ మిల్క్ పెరుగు బకెట్ 10 కేజీలపై రూ.40 పెంచారు. పెంచిన ధరలు ఈనెల 4వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని, నెలవారీ కార్డులు కొన్న వారికి ఏప్రిల్ 9వ తేదీ వరకు పాత ధర లు వర్తిస్తాయని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 03.04.2026
www.mudranews.in | @mudranews



**అమరావతి చరిత్ర**

2015 – భూముల సమీకరణ (ల్యాండ్ పూలింగ్).



రైతుల నుంచి స్వచ్ఛందంగా భూములు సమీ కరించారు. దేశం లోనే అతిపెద్ద ల్యాం డ్ పూలింగ్ ప్రాజెక్టుగా నిలిచింది.

# ప్రజాప్రతినిధులు రైతులకు మేలు చేయాలి

**- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**కోరుట్ల, ముద్ర:** జిల్లాలో వివిధ హోదాలో ఉన్న ప్రజా ప్రతినిధులు రైతులకు మేలు జరిగే విధంగా పని చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. గురువారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ లో మార్క్ ఫెడ్ ద్వారా ఏర్పాటుచేసిన మొక్కల కొను గోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని కోరారు. జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు చేశారనన్నారు. కష్టపడి పండించిన మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి జిల్లాలో 15 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. మొదటిగా ఇబ్రహీంపట్నంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించామన్నారు. రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు రూ. 2,400 మద్దతు ధర లభిస్తుందన్నారు. రబీ లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు మిల్లర్లను సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని చెప్పారు. ధాన్యం విక్రయించిన ఐదు రోజుల్లో డబ్బులు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మార్కెట్ యార్డ్ లో రైతులకు ఇబ్బందులు లేకుండా సీసీ ప్లాట్ ఫాం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగ రావు తదితరులు ఉన్నారు.

## పైరవీకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- నా పేరు చెప్పి కబ్జాలు, అక్రమ దందాలు చేస్తే ఫిర్యాదు చేయండి**

**- అనుమానమొస్తే ఎంపీ కార్యాలయ సిబ్బందికి సమాచారమివ్వండి**

**- కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన**



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తన పేరు చెప్పి ఎవరైనా కబ్జాలు, అక్రమ దందాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలుంటాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎవరైనా తన పేరు చెప్పుకుని అక్రమ దందాలు చేస్తూ పంచాయతీలు, సెటిల్ మెంట్ల పేరుతో ఇబ్బంది పెడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు సైతం అట్లాంటి పైరవీకారులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు నిరంతరం సేవ చేస్తూ పార్టీకి మంచి పేరు తెచ్చేలా పని చేసేవారిని ప్రోత్సహిస్తానని, అదే సమయంలో ప్రజలను ఇబ్బంది పెడితే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇకపై తన పేరు చెబుతూ ఇబ్బంది పెడితే... వెంటనే తన ఎంపీ కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలను కోరారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**మహదేవపూర్, ముద్ర:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలం చెల్పూర్ జెడ్పీ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్ సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో 227 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇం అనంతరం కలెక్టర్ చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పీహెచ్ సీలో ప్రహరీ నిర్మిస్తారని తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ నియోజకవర్గం సారంగాపూర్, కౌట్ల లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. కౌట్ల (బి) లో రూ.1.60 లక్షల నిధులతో చేపట్టే పనుల్లో భాగంగా గ్రామంలో రూ.30 లక్షలతో ఎస్ హెచ్ జీ భవనాల నిర్మాణానికి, రూ.30 లక్షలతో మూడు వర్కింగ్ షెడ్ల నిర్మాణానికి, రూ.24 లక్షలతో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి, రూ.2 లక్షలతో జెడ్పీ స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి, రూ. 20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే మండల కేంద్రంలో కూడా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తాం

**బోథ్, ముద్ర:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం ఆయన బోథ్ నియోజకవర్గంలో లోని వివిధ మండలాలకు చెందిన రూ.10 లక్షల ఐదు వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 19 మంది లబ్ధిదారులకు నేరడిగొండ మండలంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అత్యవసర సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందే నగదు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో ఎవరికి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని తాను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనతో ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు చేరుతాయని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 50 వార్డుల్లో గురువారం వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, వార్డు స్థాయి సమస్యలను గుర్తించి పరిష్కరించడం ఈ సభల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన, కౌన్సిలర్లు, వార్డ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి జూపల్లి పర్యటన

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శుక్రవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2:15 గంటలకు ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్రిలో జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయానికి చేరుకుని, సీఎం పర్యటన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షిస్తారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ నిర్మల్ కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసనలకు ఆయన సంఘీ భావం ప్రకటించారు. పది రోజుల నుంచి చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులకు భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు, బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాం నాథ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపాటి ఘర్షణలకు మతం రంగు పూయొద్దు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మద్యం మత్తులో జరిగే చిన్నపాటి గొడవలు, చిల్లర తగాదాలకు కొంత మంది ఆకతాయిలు మతం రంగు పూసే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇలాంటి చర్యలతో ప్రజల మధ్య ఉద్రిక్తతలు, విద్వేషాలను సృష్టించే ప్రయత్నం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేయడం, సంఘటనలను వక్రీకరించి మతపరమైన కోణంలో చూపించడం వంటి చర్యలను కఠినంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన కఠిన చర్య లు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా నిజానిజాలను తెలుసుకోవాలని సూచించారు.

## సమస్యల పరిష్కారమే గ్రామ సభల లక్ష్యం

**- కలెక్టర్ అభిలాష అభినవ్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** సమస్యల పరిష్కారమే గ్రామ సభల లక్ష్యమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ లో గురువారంనిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఉన్నతికి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు వంటి పథకాల ద్వారా జనం లబ్ధి పొందుతున్నారన్నారు. జిల్లాలో 60 వేల రేషన్ కార్డులిచ్చామన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను చర్చించి పరిష్కరించు కోవాలని సూచించారు. వైద్య కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ గ్రామసభలో డీపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, సర్పంచ్ వనిత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ ను స్ఫూర్తిగా తీసుకోవాలి



**బోథ్, ముద్ర:** అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్ అన్నారు. గురువారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్ పూలమాల వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ బండారి అనూష, బీసీ అభివృద్ధి అధికారి దరావత్ సోనియా, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి


**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు కలెక్టరేట్ లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ పీడిత వర్గాల కొరకు పోరాటాలు చేసిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆర్డీవో రత్నకళ్యాణి, బిసి, మైనారిటీల సంక్షేమాధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్, డీఈవో భోజన్న, పలువురు కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా వ్యాప్తంగా గురువారం హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రధాన హనుమాన్ దేవాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. ప్రధానంగా స్థానిక దేవరకోట సమీపంలోని వీర హనుమాన్ దేవాలయం, బస్ డిపో సమీపంలోని దక్షిణ ముఖి ఆంజనేయ స్వామి దేవాలయం, శాస్త్రినగర్ అభయాంజనేయ స్వామి తదితర ప్రధాన ఆలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దక్షిణ ముఖి ఆంజనేయ ఆలయంలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అన్ని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



నిర్మల్ లో ..



బోథ్ లో..

### బోథ్ లో..

**బోథ్, ముద్ర:** హనుమన్ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోథ్ నియోజక వర్గంలోని నేరడిగొండ మండలం చించోలి హనుమాన్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. . బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చించోలి హనుమాన్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### కోరుట్లలో..

**కోరుట్ల, ముద్ర;** పట్టణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జవహర్ రోడ్ లో గల ఆంజనేయ స్వామి దేవాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుప్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యు లు తాటి కొండ ఆంజనేయులు, అల్లాడి ప్రవీణ్, చిద్రాల వినోద్, గరిపెల్లి శ్రీనివాస్, కంటాల భాస్కర్, కొండూరి శ్రీధర్, ఏనుగందుల శ్రీనివాస్ గుడిసె కోటేశ్వర్ పాల్గొన్నారు.



కోరుట్లలో..

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 03-04-2026
www.mudranews.in | @mudranews



**అమరావతి చరిత్ర**
**2015 – శంకుస్థాపన కార్యక్రమం**




ప్రధాని చేతులతో అమరావతి శంకుస్థాపన జరిగింది. ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి లక్ష్యంగా ప్రకటించారు.

## మోత్కూర్ నియోజకవర్గ సాధనలో ముందుంటా..



● ఎమ్మెల్యే మందుల సామేల్

<u>ముద్ర, మోత్కూర్:</u>

రాబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో మోత్కూర్ నియోజకవర్గ సాధన కోసం ఈ ప్రాంత బిడ్డగా ముందుంటానని ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. గురువారం మున్సిపల్ కేంద్రంలోని ఎల్ఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మోత్కుర్ నియోజవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో మోత్కూర్, గుండాల, అడ్డ గూడూరు, ఆత్మకూర్ మండలాలకు చెందిన అన్ని రాజకీయ పక్షాల నాయకులతో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఈ ప్రాంతంలో పుట్టి ఇక్కడే చదివానని ఈ ప్రాంతంపై మక్కువతో నియోజకవర్గ సాధన కోసం రాజకీయాలకు అతీతంగా తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. గతంలో నియోజకవర్గాలలో మోత్కూర్ అడ్డగూడూర్ మండలాలు తుంగతుర్తిలో కలవగా ఆత్మకూరు గుండాల మండలాలు ఆలేరు నియోజకవర్గంలో కలిసి ఈ ప్రాంత అభివృద్ధి రాజకీయ ఆస్తిత్వం కొంత మేరకు దెబ్బతిందని అన్నారు. ఇకనైనా మోత్కూర్ నియోజకవర్గం సాధించుకునేందుకు మంత్రులు, సీఎం వద్దకు తన ఆధ్వర్యంలో తీసుకెళ్లి ఒప్పించి నియోజకవర్గాన్ని సాధిద్దామని అన్నారు.

ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యమకారులు, పాత్రికేయులు, పలు సంఘాల నాయకులు నియోజకవర్గ సాధనపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. పార్లమెంట్ లో బిల్లు పాస్ అనంతరం డీలిమిటేషన్ కమిటీతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించాలని అన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



భువనగిరి 22వ వార్డు



భువనగిరి 31వ వార్డు



మోత్కూర్

● ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u>

అర్హులందరికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ప్రజా పాలన–పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా 22వ వార్డు ఇందిరా నగర్ లో వార్డు సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆసరా పెన్షన్లు, రైతు భరోసా, భమా పథకాలు అమలవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే ప్రజలకు రేషన్ కార్డులు అందాయని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం చేపట్టడం ద్వారా ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు చేపట్టబోతున్న పథకాల గురించి వివరంగా తెలిసే అవకాశం అని, ప్రజలు ఏ సమస్య ఉన్న వార్డు సభలలో తెలియజేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవాయిస్ చిస్తి, వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, ఇంచార్జీ మున్సిపల్ కమీషనర్ కె. నరేష్ రెడ్డి, వార్డు సభ్యులు జాలిగం విగ్నేష్, బొంతల నర్సింగ్ రావు, బర్రె పూజిత జహంగీర్, సుధాగాని సరిత రాజు, నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

### సంక్షేమ ఫలాలు అర్హులకు చేరాలి..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని 31వ వార్డులో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 కార్యచరణలో బాగంగా వార్డు సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వార్డులలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల పథకాలు లబ్ధిదారులు పొందుతున్న వివరాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ వార్డు సభలో మున్సిపల్ చైర్ పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, 31 వ వార్డు కౌన్సిలర్ సుమయ్య తభసుమ్, సంబంధిత అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

### తుంగతుర్తిలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

<u>ముద్ర, తుంగతుర్తి</u>

గురువారం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు, ఆయా గ్రామాల గ్రామసభలలో ఆరంభంలో రాష్ట్ర గీతం ఆలపించి సభలను ప్రారంభించి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలు ఉంటే సభలో తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు, రేషన్ కార్డులు, పెన్షన్లు అర్హులైన వారుంటే దరఖాస్తు చేసుకుంటే 99 రోజుల ప్రణాళికలో భాగంగా వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు, గ్రామాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాల పురోగతి ని గ్రామ వార్డు స్థాయికి చేరుతున్నాయా లేదా కొత్తగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అధికారులు ప్రజలకు వివరించారు.

ఈ గ్రామ సభల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శేషు కుమార్, తహసీల్దార్ దయానందం, డిప్యూ టీ తహసీల్దార్ కంట్లమయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మోత్కూర్ లో.. పాల్గొన్న ఎమ్మెల్యే సామెల్

<u>ముద్ర, మోత్కూర్:</u>

గురువారం మోత్కూరు పురపాలక సంఘ పరిధిలోని 12 వార్డులలో వార్డు కౌన్సిలర్ల అధ్యక్షతన వార్డు సభలు నిర్వహించారు. 1, 2వ వార్డుకి సంబంధించి నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే మందుల సామెల్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్డు సభ ప్రారంభానికి ముందు తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించారు. సీఎం సందేశాన్ని మున్సిపల్ కమిషనర్ కె సతీష్ కుమార్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మోత్కూరు మున్సిపాలిటీ లో వివిధ కారణాల వలన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించలేని 27 మంది స్థానంలో నూతన లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు, సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ గడ్డం స్వప్న వైస్ చైర్ పర్సన్ పల్లెర్ల వెంకన్న, వార్డు కౌన్సిలర్లు ప్రమీల, స్వామి, శోభ, అనురాధ, శైలజ, శ్రీవిధ్య, శ్రీకాంత్, మధు, వెంకన్న, రమణ తహశీల్దార్ జ్యోతి, కమిషనర్ కె. సతీష్ కుమార్, మండల అభివృద్ధి అధికారి బాలాజీ, విద్యుత్ అధికారులు ఏ డి ఈ బాలు నాయక్ , ఏఈ ప్రభాకర్, వ్యవసాయ శాఖ అధికారిని కీర్తి, ఏ ఈ ఓ గోపీనాథ్, వార్డు అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

<u>ముద్ర, చివ్వెంల:</u>



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నరసింహ అన్నారు. చివ్వెంల మండలం తిరుమలగిరి గ్రామంలో గురువరం ప్రజా పాలన—ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ హాజరై మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ పథకాల సద్వినియోగం, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే రోడ్డు భద్రత, సైబర్ మోసాలు, డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత గ్రామాల నిర్మాణం, మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రత, తల్లిదండ్రుల పట్ల గౌరవం వంటి అంశాలను ప్రాముఖ్యంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, స్థానిక ఎస్సై మహేష్, సర్పంచ్ నగేష్, ఉప సర్పంచ్ వెంక రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరసింహ చారి, వార్డు సభ్యులు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ దయాకర్, గ్రామ కార్యదర్శి కవిత, హౌసింగ్ ఏఈ ప్రేమలత, మెడికల్ ఆఫీసర్ మణికంఠ, గ్రామ పోలీసు అధికారి కృష్ణయ్య, గ్రామస్తులు ఉన్నారు.

### సర్పంచ్ ను నిలదీసిన గ్రామస్తులు

<u>ముద్ర, మోత్కూర్:</u>



మండలంలోని దాచారంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొంది. గ్రామ యువకులు సర్పంచ్ కర్నె జ్యోతి వీరేశంను వివిధ అభివృద్ధి కార్యక్ర మాలపై నిలదీశారు. నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లలో నాణ్యత లోపం ఏర్పడిందని, సీసీ రోడ్ల కాంట్రాక్టర్ ఎవరో తెలుపాలని కోరారు. గ్రామ పంచాయతీలో ఎలాంటి తీర్మా నం లేకుండా సర్పంచ్ ఏకపక్షంగా వ్యవహరించి నాణ్యత లేని సీసీ రోడ్లు వేయించారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా గ్రామ సిబ్బందితో సీసీ రోడ్లకు నీటిని సప్లై చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్య క్రమంలో ఎంపీఓ పి జనార్దన్ రెడ్డి ఆర్ బ్ల్యూ ఎస్ డీ ఈ పద్మావతి, జిపిఓ మందుల ఐలయ్య, పంచాయతీ కార్య దర్శి బి యాదగిరి, సంఘ బంధం అధ్యక్షురాలు ఖమ్మం పాటి రేణుక, అంగన్వాడి చింతల నర్మద, గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఉండాటి కృష్ణ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి'

<u>ముద్ర, తుంగతుర్తి:</u>



బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తునికి సాయిలు గౌడ్, జిల్లా నాయకుడు గుండగాని రాములు గౌడ్ లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా గౌడ సంఘం నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపాన్నగౌడ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని, దళిత, బహుజనులను ఏకం చేయడానికి ఎంతో కృషి చేసి బహుజన రాజ్యం వైపు నడిపించిన వ్యక్తి పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గడ్డం ఉప్పలయ్య, పులుసు వెంకటనారాయణ గౌడ్, పులుసు వెంకన్న గౌడ్, గోపగాని రమేష్ గౌడ్, గుండగాని శ్రీనివాస్ గౌడ్, గుండగాని సుధాకర్ గౌడ్, తునికి నాగరాజు గౌడ్, కట్ల మల్లయ్య, తొట్ల సుధాకర్ గౌడ్, మద్దెల నర్సయ్య గౌడ్, చిర్ర నరేష్, వెంకన్న, బత్తుల జలంధర్ గౌడ్, బత్తుల శ్రీను, గుండగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తుమ్మల మురళీధర్ రెడ్డి



<u>ముద్ర, మోత్కూర్:</u>

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన తుమ్మల మురళీధర్ రెడ్డిని గురువారం బీజేపీ మోత్కూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు టౌన్ అధ్యక్షురాలు చాడా మంజుల రెడ్డి , యాదాద్రి భువనగిరి జిల్లా కోశాధికారి గుజ్జ సోమ నరసయ్య, జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు పోచం సోమయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి జినుకల దశరథ, భీమిటి తిరుమల్ రెడ్డి, కొనతం వెంకట్రెడ్డి, కాంభోజు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u>

భువనగిరి మండలంలోని అనాజిపురం గ్రామంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు బాతుక అశోక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎదునూరి చంద్రయ్య, గడుగు నరేష్, కదరి భారత్, నీలం వెంకటేష్, గోగు పోచయ్య, గంగాధరీ మల్లేష్, గోదా మల్లేష్, మాకోలు శివ, శ్రీరాం శరత్ యాదవ్, నీలం సుదర్శన్, కదరీ భాను, కొత్తపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయం శాఖ చైర్మన్ పదవి బాధ్యతలు స్వీకరణ

<u>ముద్ర ,మోత్కూర్:</u>



తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామే ల్ సమక్షంలో మోత్కూర్ శాఖా గ్రంథా లయం చైర్మన్ గా కోమటి మత్స్యగిరి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామె ల్ కోమటి మత్స్య గిరిని శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. అనంతరం ఇటీవల రూ.10 లక్షలతో నిర్మించిన రీడింగ్ హాల్ ను ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీ నర్సింహా రెడ్డి, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గుండ గోని రామచంద్రు గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, లైబ్రరియన్ మధుసూధన్ రెడ్డి, కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు, పాఠకులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడు రాంరెడ్డి మృతి తీరని లోటు

**- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్**

<u>ముద్ర, చిట్యాల :</u>

ప్రమోద సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు కందిమళ్ళ రాంరెడ్డి మరణం విద్యార్థి, ఉపాధ్యాయ రంగాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్యలు అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో అనేక మంది విద్యార్థులకు బోధన చేసిన రాంరెడ్డి, ప్రమోద సాహితీ సమితి ద్వారా ప్రతి ఉగాది పండుగ సందర్భంగా కవి సమ్మేళనంతో పాటు, వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన ప్రముఖులను ఆహ్వానించి సన్మానాలు చేసేవారని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు.

## ఘనంగా వీర హనుమాన్ విజయ యాత్ర

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u>



వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ భువనగిరి పట్టణంలో గురువారం విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెరుమాండ్ల హనుమాన్ దేవాలయం వద్ద జిల్లా కమిషనరేట్ ఎస్పీ అకాంక్ష్ యాదవ్ పూజలు నిర్వహించి కాషాయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. భువనగిరి పుర వీధుల గుండా రామనామ స్మరణతో హనుమంతుని జయ జయ ధ్వనులతో యాత్ర ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో ఆర్ వాయిస్ జర్నలిస్ట్ నవత ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. గడప లోపలే కులం గడప దాటితే హిందువులం అనే నినాదంతో ఐకమత్యంగా ఉండి దేశ విచ్చిన్నకర శక్తులతో శివాజీ వారసత్వాన్ని, ఝాన్సీ లక్ష్మి వీరత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాలని యువతకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హనుమంతుని భక్తునిగా ధర్మరక్షణలో, స్త్రీ, గోరక్షణలో పాల్గొని హిందువుగా జీవించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ తాడెం పాండు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వూట్కూరి అశోక్, కిరణ్ కుమార్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్, కార్య అధ్యక్షుడు పోలా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గీస ఆనంద్, ఉపాధ్యక్షుడు చుక్కల శ్రీశైలం, కోశాధికారి చామ రవీందర్, లీగల్ సెల్ కన్వీనర్ సెల్వేరు వేణు, పట్టణ అధ్యక్షుడు కందికొండ సహదేవ్, వల్లబోజు సతీష్, బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ బింగి భరత్ కుమార్, జిల్లా గోరక్ష ప్రముఖ్ నమిలే నవీన్, పట్టణ కన్వీనర్ జడల అక్షయ్, పొన్నాల వినయ్, సూర్వి శ్రీనివాస్, రాకేష్, అరుణ్ పూస శ్రీనివాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### గుర్రాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u>



వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ సందర్భంగా భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తా వద్ద గుర్రాల ఫౌండేషన్ అధ్యక్షుడు గుర్రాల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, గ్రంధాలయం చైర్మన్ అవైస్ చిస్తీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పోత్నాక్ ప్రమోద్ కుమార్, ఎండీ బురహన్, పిట్టల బాలరాజు, బెండ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
03.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**అమరావతి చరిత్ర : 2016–2018 – నిర్మాణాల ప్రారంభం**

సచివాలయం, అసెంబ్లీ వంటి తాత్కాలిక భవనాలు నిర్మించారు. మౌలిక సదుపాయాల పనులు వేగంగా ప్రారంభమయ్యాయి.



# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- **మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**




రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గ్రామసభ తెలంగాణ గీతంతో ప్రారంభమైంది. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని గ్రామ ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల లబ్ధిదారుల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామంలో మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని 28 స్వయం సహాయక సంఘాలకు రూ.3.50 కోట్ల రుణాలు అందించగా, రూ.2.50 లక్షల వడ్డీ సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, రైతు భీమా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అల్మాయిపేట గ్రామంలోని సర్వే నం.513లో కొత్త కాలనీ ఏర్పాటు చేస్తే రహదారులు, నీటి ట్యాంక్, విద్యుత్ సౌకర్యాలు, ఇళ్ల నిర్మాణం వంటి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, హైవే నుంచి అల్మాయిపేట-కొన్యాల వరకు బీటీ రహదారి, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు మంజూరు చేస్తామని తెలిపారు. మంజూరైన 7 ఇందిరమ్మ ఇళ్లలో 4 మాత్రమే నిర్మాణం పూర్తవడంతో, మిగిలిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. ఆందోల్ ప్రాంతంలో ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటు చేసినట్లు, విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని కోరారు. నియోజకవర్గంలో త్వరలో ఫార్మసీ కళాశాల స్థాపనతో పాటు సంగుపేట గుట్ట వద్ద రెండు మూడు పరిశ్రమలు రానున్నట్లు వెల్లడించారు. పేదలకు చెందిన సుమారు 40 ఎకరాల అసైన్డ్ భూమి తప్పుగా రిజిస్ట్రేషన్ అయిన అంశంపై ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేసి, రిజిస్ట్రేషన్ రద్దు చేసి భూములను అసలు లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే రెండు నెలల్లో 10 శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పిల్లలకు పోషకాహారంతో కూడిన రాగి జావాతో బ్రేక్‌ఫాస్ట్ పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకాలను ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుని గృహ నిర్మాణానికి మంత్రి, కలెక్టర్ కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్, ఉపసర్పంచ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పట్టణంలోని గోసముద్ర తటాక తీరాన స్వయంభువుగా వెలసిన మహిమాన్విత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ విజయోత్సవ జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశానుగత ధర్మకర్త కాకులవరం మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచే 108 లీటర్ల ఆవుపాలతో పంచముఖ హనుమాన్ విగ్రహానికి అభిషేకం, అలంకరణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. అలాగే 108 పర్యాయాలు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ జరిపారు. మెదక్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

- **ఎమ్మెల్యే పూజలు**

ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వంశానుగత ధర్మకర్త కాకులవరం మధుసూదనాచారి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధికా భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు దొంతి లక్ష్మి, రాజశేఖర్, శివరామకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, మాజీ డైరెక్టర్ రాగి చక్రపాణి, మ్యాడం బాలకృష్ణ, బొజ్జ పవన్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ సహా పలువురు నాయకులు దర్శించుకున్నారు.

**సంగారెడ్డిలో ..**

**సంగారెడ్డి** : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని "జై శ్రీరామ్", "జై హనుమాన్" నినాదాలతో నగరాన్ని మార్మోగించారు. శోభాయాత్ర సంగారెడ్డి బైపాస్ ప్రాంతానికి చేరుకోగా హ్యాపీ డెంటల్ క్లినిక్ డా. శిల్పా ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బైక్ ర్యాలీగా వస్తున్న భక్తులకు వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు, గ్లూకోజ్ పానీయాలు పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. అదేవిధంగా కౌన్సిలర్ నవీన్ ఆధ్వర్యంలో శోభాయాత్రకు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తాం : అత్తు ఇమామ్

**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట :**



సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తామని సిద్ధిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. గురువారం సిద్ధిపేటలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా మంచి పాలన అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక కొండం సంపత్ రెడ్డి వంటి బీఆర్ఎస్ నాయకులు కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎలాంటి అర్హతలేని సంపత్ రెడ్డి ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికకు సంబంధించిన ఫ్లెక్సీని చింపివేశారని విమర్శించారు. దీనికి నిరసనగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తున్నారని, దీనితో తమ రాజకీయ ఉనికి కోల్పోతున్నామనే భయంతో బీఆర్ఎస్ నాయకులు పాకులాడుతున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు 1340 సర్వే నంబర్‌లో భూకబ్జాలకు పాల్పడినందుకు సంపత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గత 10 సంవత్సరాల్లో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో, సిద్ధిపేటలో నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ జెండాతో ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దాస అంజయ్య, మార్క సతీష్, బిక్షపతి, అర్షద్ హుస్సేన్, వహాబ్, అజ్మత్, ఖయాజుద్దీన్, చోటా స్మత్, అక్బర్, విజయ, డానియల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుకు రైతులు ముందుకు రావాలి

**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట :**

కొండపాక మండలం దుద్దెడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామసభలో ముఖ్య అతిథిగా కలెక్టర్ కే. హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని గ్రామస్తులకు చదివి వినిపించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తూ, దుద్దెడ గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారుల వారీగా వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి తదితర పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను సభలో పంచుకున్నారు. ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించాలంటే సేంద్రియ వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలని, పంట మార్పిడి విధానాన్ని పాటించాలని సూచించారు. గ్రామంలో కోతుల సమస్య నివారణతో పాటు అర్హులైన పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేశారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీడీవో, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు పురోగతిపై సమీక్ష

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎం &హెచ్ఓ, డీసీహెచ్ఎస్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, జోగిపేట, పఠాన్‌చెరువు ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, సదాశివపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆభా ఖాతాల నమోదు సంఖ్యను పెంచాలని, ప్రతి రోగికి తప్పనిసరిగా ఆభా ఐడీ నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఓపీ స్లిప్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో అప్లోడ్ చేయాలని, ఫార్మసీ సేవలను కూడా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ డా. కవిత, డా. శశాంక్, ఇతర వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడం, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం చేగుంట మండలం వడియారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సందేశాన్ని, గ్రామపంచాయతీ నివేదికను సర్పంచ్ గ్రామసభలో చదివి వినిపించారు. పలువురు సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవన కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్‌కు విస్తరించడం, ప్రతిభావంతులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాల పంపిణీ, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ చేగుంట మండలం వడియారం గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులకు ప్రభుత్వ ప్రయోజనాలను చేరవేస్తున్నామన్నారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి హేమ భార్గవి, సర్పంచ్ సాయి కుమార్, మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ బండారి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఎంపీఓ విజయపాల్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**చిల్వర్ గ్రామసభలో పాల్గొన్న అదనపు కలెక్టర్ నగేష్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అల్లాదుర్గ్ మండలం చిల్వర్ గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. అర్హతలను బట్టి పథకాల లబ్ధిదారులను గ్రామసభ ద్వారా ఎంపిక చేస్తున్నామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కెర శశిధర్ రెడ్డి, ఉపసర్పంచ్ చాకలి లక్ష్మి, వార్డు సభ్యులు, ప్రత్యేక అధికారి ఏ. వైష్ణవి, మండల వైద్యాధికారి సారిక, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలందించేందుకు గ్రామసభలు : ఎమ్మెల్యే రోహిత్ రావు**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు, గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. గురువారం మెదక్ పట్టణంలోని దాయర 16, 17 వార్డులతో పాటు హవేలీ ఘనాపూర్ మండలం ముత్తాయకోట, లింగ్సాన్‌పల్లి గ్రామసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు రాజశేఖర్, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

**- పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్.**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

కొండాపూర్ మండలం తొగార్పల్లి గ్రామంలో గురువారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొన్నారు. గ్రామ సభను రాష్ట్ర గీతంతో ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గ్రామ ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో అమలవుతున్న పలు కీలక పథకాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పంచాయతి రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. జిల్లాలో అధిక శాతం అధికారులుగా మహిళలే ఉన్నారని, మహిళలు పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాబోయే 90 రోజుల్లో శాఖల వారీగా పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, పీడీ డీఆర్డీఓ జ్యోతి, సర్పంచ్ దివ్య వాణి ప్రశాంత్ గౌడ్, ఉపసర్పంచ్ , ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- **మంత్రి దామోదర్ రాజనర్సింహ నివాళి**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన తెలంగాణ ప్రాంతానికి అందించిన స్ఫూర్తి, త్యాగాలను భవిష్యత్ తరాలకు చేరవేయడానికి వారు నిర్మించిన కోటలను పర్యాటక, పురావస్తు కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు జిల్లా కలెక్టర్ మాధురి, అదనపు జిల్లా కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




సర్వాయి పాపన్న గౌడ్ చిత్రాపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు

**బీ.సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో..**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సర్వాయి పాపన్న గౌడ్ 316 వ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి కలెక్టర్, బిసి కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజుగౌడ్, కల్లుగీత కార్మికుల అధ్యక్షులు రమేష్, వీరేశం, ఆశన్న, వినయ్ గౌడ్ పాల్గొన్నారు.

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అందరికి ఆదర్శం : అదనపు కలెక్టర్**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

కులం, సామాజిక సమానత్వం, న్యాయం కోసం పోరాడిన వీర యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అణచివేతకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మంగా రమేష్ గౌడ్, రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ విధ్యాధర్ గౌడ్, సంఘ నాయకులు నర్సింహులు గౌడ్, సురేందర్ గౌడ్, నాగరాజు గౌడ్, యాదగిరి గౌడ్, శంకర్ గౌడ్, కుమార్ గౌడ్, సహాయ వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగా కిషన్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, లవన్, భాను ప్రకాష్, ఆరీఫ్, నర్సింహులు, సిద్దరాములు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**అమరావతి చరిత్ర : 2019 – ప్రభుత్వ మార్పు**
పాలకులు మారడంతో అమరావతి అభివృద్ధి వేగం తగ్గింది. మూడు రాజధానుల ప్రతిపాదనతో అనిశ్చితి నెలకొంది.





# గ్రామ సభ బహిష్కరణ

- **నిధుల కేటాయింపులో పక్షపాతం**
- **-గత రెండేళ్లుగా అందని నిధులు సీఎం, స్పీకర్ జిల్లాలో దారుణం**
- **తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీర్తి రామకృష్ణ**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు రాజకీయ రాభందుల పడగ నీడలో నలిగి పోతున్నాయని, అధికార పార్టీ గల్లీ లీడర్లు చెబితేనే అభివృద్ధికి నిధులు, పథకాలు కేటాయించే స్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగడం విడ్డూరమని మోమిన్ పేట మండలం కోల్ కుంద గ్రామ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ ఆరోపించారు. గురువారం గ్రామంలో గ్రామ సభను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కక్ష సాధింపు రాజకీయాలతోనే గ్రామాలు అభివృద్ధి సాధించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి కేటాయించే నిధులను పార్టీల పేరు చెప్పుకొని ప్రజా సొమ్మును వక్ర మార్గంగా మింగి బ్రతుకుతున్న కొందరు ధగాకోరుల కారణంగానే పల్లెటూర్లు అభివృద్ధి చెండలేక పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, సభాపతిలు ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో పరిస్థితి ఇలా ఉందని సర్పంచ్ కీర్తి రామకృష్ణ తెలంగాణ సర్పంచ్ ల సంఘం ప్రధాన కార్యదర్శి వివరించారు. ప్రతినెల గడపగడపకు తిరుగుతూ ప్రజా పాలన కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కృషి చేస్తున్న, అక్కసుతో అధికార పార్టీ నాయకులు తమపై కక్షగట్టి వేధిస్తున్నారని ఇటీవల గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ (చెక్ నెంబర్ 143203) మార్చి10వ తేదీన రిలీజ్ అయినట్టు సమాచారం వచ్చింది. ఇప్పటివరకు ఆ చెక్కు అందలేదని, ఈ విషయమై మండల పరిషత్, ఎమ్మార్వో కార్యాలయాల్లో సమాచారం ఇచ్చినప్పటికీ ఒకరిపై ఒకరు చెప్పడం తప్ప న్యాయం చేయడం లేదని, జిల్లా ఎస్పీ దృష్టికి, ఈ చెక్కు విషయమై సమాచారం ఇవ్వగా ఇది క్రిమినల్ సమస్య కాదని దాటా వేయడం, కనీసం మర్యాద ఇవ్వకుండా ఎస్పీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అధికారులు బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మహిళా సర్పంచ్ పట్ల అధికారులు అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు తమను తీవ్రంగా కలిచి వేస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమను అడుగడుగునా అవమాన పరుస్తూ జవాబుదారీ తనము లేని ప్రభుత్వం సూచించిన ముఖ్యమంత్రి సందేశాన్ని తాను చదవలేక పోతున్నానని గ్రామ సభను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న గత రెండు దపాలుగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులను విడుదల చేయడం పాటు గ్రామానికి తక్షణం గ్రామపంచాయతీ కార్యదర్శి నియమించాలని కోరారు.

# ‘ఆన్ లైన్’లోనే ఇసుక

- **వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా ఆన్లైన్ ద్వారానే చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్, వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్, జిల్లాలో ఇసుక సరఫరా, వినియోగం, నిల్వలు, రవాణా తదితర అంశాలపై రెవెన్యూ అదనపు కలెక్టర్ రాజేశ్వరిలతో కలిసి మైన్స్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాల కోసం ప్రభుత్వ అవసరాల కోసం అవసరమైన ఇసుక ను పూర్తిగా ఆన్లైన్ విధానం లోనే చేసుకొని పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద నియమ నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే, ఆన్లైన్ బుకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఇసుక నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పి పి టి ద్వారా ఇసుక ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకునే విదానాన్ని ఇడి ఎం మహమ్మద్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఈ ఈ పి ఆర్ ఉమేష్, ఎ డి మైనింగ్ సత్యానారాయణ, పెద్దేముల్, బషీరాబాద్, బొంరాస్ పేట్, తాండూర్ మండలాల తహసీల్దార్ లు, పంచాయతీ సెక్రటరీ లు, డీఈలు, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానితో బండి సంజయ్ భేటీ

- **కరీంనగర్ కార్పొరేషన్ ను బీజేపీ కైవసం చేసుకోవడంపట్ల మోదీ సంతోషం**
- **అట్టడుగు వర్గాలకు కేంద్ర సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని సూచన**

**ముద్ర , కరీంనగర్ :**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బీజేపీ కైవసం సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా వీరి మధ్య ప్రస్తావనకు రాగా ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కేంద్ర నిధులు, అభివృద్ధి నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లామని విషయాన్ని ఈ సందర్భంగా బండి సంజయ్ మోదీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతోపాటు “మోదీ గిఫ్ట్” పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను అందించిన అంశాన్ని ప్రస్తావించారు. నూతనంగా గెలిచిన కరీంనగర్ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల పక్షాన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని “ప్రజలకు నిరంతరం సేవ చేయడంలోనే తృప్తి ఉంటుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు క్రుషి చేయండి. అట్టడుగు వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో నిర్విరామంగా పనిచేయండి”అని సూచించారు.

# మరో 2 లక్షల మందికి ‘చేయూత’

- **కొత్త పెన్షన్లకు గ్రీన్ సిగ్నల్**
- **బడ్జెట్‌లో రూ.233 కోట్లు**
- **రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల వెల్లువ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



చేయూత పథకం కింద కొత్తగా మరిన్ని పెన్షన్లు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం 2026-27 ఆర్థిక బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయించింది. ఇప్పటికే లక్షల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో లబ్ధిదారుల ఎంపిక కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే వడబోత కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

**ప్రస్తుతం 42.23 లక్షల పెన్షన్లు**

తెలంగాణలో ప్రస్తుతం 42.23 లక్షల మంది వివిధ వర్గాల్లో ప్రతి నెలా పెన్షన్లు అందుకుంటున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు, బోదకాలు బాధితులకు ప్రభుత్వం నెలకు రూ.2,016 చొప్పున పెన్షన్ అందిస్తోంది. దివ్యాంగులకు నెలకు రూ.4,016 చొప్పున ఇస్తోంది. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులు మినహా ఇతరులకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికే 12 లక్షల మందికిపైగా దరఖాస్తులు చేసి ప్రభుత్వం అనుమతి కోసం వేచి చూస్తున్నారు. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల కోసం రూ.233 కోట్ల నిధులు ప్రకటించడంతో దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోంది. గత నెల 20వ తేదీ నుంచి ప్రజావాణి సహా ఇతర కార్యక్రమాల ద్వారా అర్హులు దరఖాస్తులు సమర్పిస్తున్నారు.

**భారీగా దరఖాస్తులు**

రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ గ్రామసభల్లో కూడా కొత్త పెన్షన్లకు సంబంధించి భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఉన్న 12 లక్షల దరఖాస్తులతో పాటు కొత్తవి చేరనుండటంతో, ప్రభుత్వం ఆమోదించిన 2 లక్షల లబ్ధిదారులను ఎంపిక చేయడం అధికారులకు సవాల్‌గా మారింది. రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షల మంది, వితంతు, ఒంటరి మహిళల పింఛన్ల కోసం 3.5 లక్షల మంది, చేనేత, గీత కార్మిక పింఛన్ల కోసం 3 లక్షల మంది, దివ్యాంగుల పింఛన్ల కోసం 72 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు.

# చేనేత కార్మికులపై కాంగ్రెస్ కుట్ర

- **విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్ రద్దు దుర్మార్గమైన చర్య**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేనేత కార్మికుల జీవితాలను అంధకారంలోకి నెట్టివేసే కుట్రలు చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖ ఆధ్వర్యంలోని యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆర్డర్లపై ఆధారపడిన చేనేత కార్మికుల పొట్టకొట్టే దుర్మార్గ చర్యగా విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏటా సుమారు రూ.105 కోట్ల విలువైన యూనిఫాంల ఆర్డర్‌ను రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలకు ఇస్తున్నారని, దీని ద్వారా వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏకపక్షంగా ఈ ఆర్డర్‌ను రద్దు చేయడంతో కార్మికులు వీధిన పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ శాఖలు, ఇతర విభాగాలకు సంబంధించిన రూ.200 కోట్ల విలువైన దుప్పట్లు, ఇతర దుస్తుల పంపిణీకి సంబంధించిన ఆర్డర్‌ను కూడా టెస్కోకు ఇప్పటికీ ఇవ్వకపోవడం కార్మికులను సంక్షోభంలోకి నెట్టివేయడమేనన్నారు. గడువు ముగిసినా టెస్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా ఆ సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు అనుకూలమైన ప్రైవేట్ వ్యక్తులకు ఈ ఆర్డర్లను కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. చేనేత కార్మికులకు అన్యాయం చేసే ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు.

# ఇద్దరు ఐఏఎస్‌లు బదిలీ

- **పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వాణి ప్రసాద్**
- **క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేశ్ రంజన్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**


రాష్ట్రంలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యాటక, క్రీడా శాఖలకు కొత్తగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాణిప్రసాద్‌ను పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ఆమె దృష్టి సారించనున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న జయేష్ రంజన్‌ను క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల కల్పన మరియు క్రీడాకారులకు ప్రోత్సాహం అందించే బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా, కీలకమైన పర్యాటక, క్రీడా శాఖలలో అనుభవజ్ఞులైన అధికారులను నియమించడం ద్వారా ఆయా రంగాలలో వేగవంతమైన అభివృద్ధిని ప్రభుత్వం ఆశిస్తోంది. బదిలీ అయిన ఇద్దరు అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలను స్వీకరించనున్నారు.



# చేనేత కార్మికుల పొట్టకొడుతోన్న కాంగ్రెస్

- **టెస్కో నుంచి రూ.105 కోట్ల యూనిఫాం టెండర్ రద్దు వెనక మతలబేంటీ..?**
- **ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టెస్కోకు కేటాయించిన ఆర్డర్లను రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత సంఘాల కార్మికుల పొట్టకొడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆరోపించారు. తెలంగాణ చేనేత సహకార సంఘం (టెస్కో)కు కేటాయించిన రూ.105 కోట్ల విలువ గల పాఠశాల యూనిఫాం ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. సంక్షేమ శాఖ నుంచి టెస్కోకు దక్కాల్సిన రూ.200 కోట్ల విలువైన దుస్తులు, దుప్పట్ల ఆర్డర్ ఇప్పటికీ ఇవ్వకపోవడం వెనుక కారణమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ కోసం ఇచ్చిన రూ.105.54 కోట్ల ఆర్డర్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 1న చేనేత శాఖకు లేఖ రాసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డ కేటీఆర్ గురువారం సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. కమీషన్లు దండుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు కట్టబెడుతోందని ఆరోపించారు. నేతన్నల ఉసురు పోసుకుంటున్న కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. అసలు ఇది ప్రజా ప్రభుత్వమా, లేక ‘ప్రైవేట్ లిమిటెడ్’ కంపెనీయా అని ప్రశ్నించారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడమేనా ప్రజాపాలన అని నిలదీశారు.

# ‘ఐప్యాక్’పై ఈడీ దాడులు

- **హైదరాబాద్, బెంగళూరు, ముంబై నగరాల్లోని కార్యాలయాల్లో తనిఖీలు**
- **మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో సోదాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటోన్న ప్రముఖ రాజకీయ వ్యూహకర్త సంస్థ ఐప్యాక్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఎన్ ఫోర్స్ మెంట్ (ఈడి) అధికారులు గురువారం ఉదయం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న ఐప్యాక్ ప్రధాన కార్యాలయాలతోపాటు ఆ సంస్థ వ్యవస్థాపకుల నివాసాల్లో దాడులు నిర్వహించారు. కీలక రికార్డులు తనిఖీ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాలపై ఈడీ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, ఐప్యాక్ ఫౌండర్ల వ్యక్తిగత నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసులో భాగంగా గత కొంతకాలంగా ఐప్యాక్ ఆర్థిక లావాదేవీలపై నిఘా ఉంచిన ఈడీ అధికారులు, మనీలాండరింగ్ జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. రాజకీయ వ్యూహాల కోసం వివిధ పార్టీల నుంచి అందుకున్న నిధుల మళ్లింపుపై ప్రధానంగా దృష్టిసారించారు. విదేశీ నిధుల సమీకరణలోనూ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు అనుమానిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు పార్టీలకు ఎన్నికల వ్యూహాలను అందించే ఐప్యాక్ సంస్థపై ఈడీ దాడులు జరగడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. ఈ సోదాల అనంతరం ఈడీ అధికారులు అధికారికంగా ఎలాంటి విషయాలు వెల్లడించలేదు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
04.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



అమరావతి చరిత్ర : 2020–2022 – రైతుల ఆందోళనలు
రాజధాని మార్పు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. అమరావతి కోసం దీర్ఘకాల పోరాటం కొనసాగింది.




## ఐపీఎల్‌లకు భారీ పోలీస్ బందోబస్తు

- **ఉప్పల్ డీసీపీ సురేష్**

**ముద్ర, మల్కాజిగిరి :**

హైదరాబాద్ ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఏప్రిల్ 5 నుండి మే 22 వరకు జరగనున్న టాటా ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల కోసం భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఉప్పల్ డిసిపి సురేష్, ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులు తెలిపారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు తెలియజేశారు. సుమారు 39,000 సీటింగ్ సామర్థ్యం గల ఈ స్టేడియంలో సుమారు 2000 మంది పోలీస్ సిబ్బందిని మోహరించన్నునట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, భద్రతా విభాగాలు, టీఎస్ఎస్పీ దళాలు, మౌంటెడ్ పోలీస్, బాంబ్ డిస్పోజల్ టీమ్స్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని. స్టేడియం పరిసరాల్లో 430 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రతి గేట్ వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తుండగా, గేట్ నం.1 ను కేవలం ఆటగాళ్లకు మాత్రమే కేటాయించారు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసి, అగ్నిమాపక దళాలను సిద్ధంగా ఉంచారు. ప్రేక్షకులు తమ టికెట్ల ప్రకారం గేట్ల ద్వారా మాత్రమే ప్రవేశించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

# ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- **జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు వెంకటేష్**
- **విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై ధర్నా**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం యజమాన్యం మొండి వైఖరి వీడాలనీ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కావాలి వెంకటేష్ అన్నారు. గురువారం ఆర్టిజన్ కార్మికులు వికారాబాద్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 8 నుంచి సమ్మె సిద్ధంగా ఉన్నామన్నారు. గత 20 సంవత్సరాల నుంచి విద్యుత్ సంస్థలో వెట్టి చాక్లెట్ చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను ప్రభుత్వం, యజమాన్యం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికుందరికీ విద్యుత్ శాఖలో ఒకే సంస్థ ఒకే రూల్స్ ఉంటది కానీ మన విద్యుత్ శాఖలో మాత్రం చట్టానికి విరుద్ధంగా రెండు రూల్స్ ప్రైవేటు సెక్టార్ లో ఉన్నటువంటి 1947 బ్రిటిష్ కాలం నాటి చట్టం స్టాండింగ్ ఆర్డర్ అమలు చేసి ఆర్టిజన్ కార్మికులకు అన్యాయం ఆయన తెలిపారు. విద్యుత్ సంస్థలో సుమారు 8 సంవత్సరాలు గడుస్తున్నది ఆర్టిజన్ కార్మికులు కన్వర్షన్ చేయలేదని, ఇప్పటి వరకు ప్రమోషన్ కూడా ఇవ్వకుండా ఆర్టిజన్ కార్మికుల ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ ఇంక్రిమెంటు, 24 గంటల ఇంక్రిమెంట్ గాని అమలు చేయకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తూ చాలీ చాలని వేతనాలతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆయన తెలిపారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే రూల్స్ అది ఏపీఎస్ఈబి రూలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టిజర్ కార్మికులు ఎన్నోసార్లు యాజమాన్యానికి, ప్రభుత్వానికి నోటీస్ ఇవ్వడం జరిగింది అయినా కానీ ఇప్పటివరకు యాజమాన్యం ప్రభుత్వం స్పందించడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలనీ, విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ చేయాలని, కార్మికులందరినీ రెగ్యులర్ చేసి ఒకే రూల్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో జీఓ నెం.11 ప్రకారం పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలనీ, వెంటనే 2026 పీఆర్సీ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి ఆయన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 8 నుంచి సమ్మె సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో కార్యాలయంలో ఎస్సీ కి సమ్మెకు సిద్ధంగా ఉన్నామని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, మహేష్, బిచ్చిరెడ్డి, అక్తర్ అలి, బాల్ రాజు, సుబన్, వెంకటయ్య , అశోక్, కిరణ్, దేవమ్మ, వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్2026

- **లోగో ఆవిష్కరణ**

**ముద్ర, హైదరాబాద్ :**

రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించే లక్ష్యంతో నిర్వహించనున్న "యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ 2026" అధికారిక లోగోను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, యువతలో వ్యాపార ప్రోత్సాహానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. జై సంస్థ సీఈఓ వరప్రసాద్ సింగిరెడ్డి మాట్లాడుతూ, జూన్ 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 300కిపైగా ఎగ్జిబిటర్లు, స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నట్లు చెప్పారు. సమ్మిట్‌లో భాగంగా వ్యాపార ప్రదర్శనలు, జాతీయ స్థాయి ఎంట్రప్రెన్యూర్షిప్ కాన్ఫరెన్స్, మార్కెట్ అవకాశాలపై జ్ఞాన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా వ్యాపారవేత్తలకు ప్రత్యేకంగా "విమెన్ ఎంట్రప్రెన్యూర్స్ పావిలియన్" ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అయితే, ఈ సమ్మిట్‌కు హాజరుకావాలనుకునే వారు ఉచిత విజిటింగ్ పాసుల కోసం అధికారిక వెబ్‌సైట్ (www.yes4growth.org) లో నమోదు చేసుకోవాలని సూచించారు.

## వైభవంగా శ్రీ ఉమామహేశ్వర స్వామి వ్రతం

**ముద్ర, ప్రతినిధి నాగర్ కర్నూల్:**



నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో శ్రీ జేష్ఠ మాత సమేత శనేశ్వర స్వామి పునః ప్రతిష్ఠకు 26 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం మూడో రోజు ప్రత్యేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య సాగాయి. ఈ సందర్భంగా మండల ఎస్ఐ శ్రీనివాస్ దంపతులు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదమూర్తులైన అర్చక బృందం ఆధ్వర్యంలో శ్రీ ఉమామహేశ్వర స్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వ్రతం నిర్వహణతో సకాలంలో వర్షాలు కురిసి పంటల సమృద్ధి, ప్రకృతి విపత్తుల నివారణ, భక్తుల కోరికల సాధన, అష్ట ఐశ్వర్య ప్రాప్తి కలుగుతాయని అర్చకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాలరావు, ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి, సర్పంచ్ సుగుణమ్మ, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖరాచారి, పుల్లయ్య, శ్రీకాంత్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మధంశెట్టి నరేష్ శెట్టి, కేంచే రాజేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రూ.8 లక్షలు.. బంగారంతో బాలుడు పరారీ

**ముద్ర కూకట్‌పల్లి :**



కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఓ మైనర్ బాలుడు ఇంట్లో ఉన్న నగదు, బంగారంతో కనిపించకుండా పోయిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిత్య నగర్‌కు చెందిన నంద్యాల నాగార్జున రెడ్డి కుమారుడు నంద్యాల సిద్ధార్థ రెడ్డి (17) గురువారం తెల్లవారుజామున 6 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ తన వెంట స్ప్లెండర్ మోటార్ సైకిల్‌ను తీసుకువెళ్లాడు. బైక్‌ను ఎక్కడో ఒకచోట వదిలేస్తానని ఓ లేఖ రాసి వెళ్ళినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బీరువాను తనిఖీ చేయగా.. అందులో ఉన్న రూ. 8 లక్షల నగదు, 9 తులాల బంగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించారు. సిద్ధార్థ రెడ్డి మొబైల్ ఫోన్ ప్రస్తుతం స్విచ్ ఆఫ్ వస్తోంది. గతంలో కూడా సదరు బాలుడు రెండుసార్లు ఇలాగే ఇంటి నుండి వెళ్ళిపోయాడని ఫిర్యాదుదారు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్.ఐ టి. అవినాష్ బాబు ఆధ్వర్యంలో బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

# రెండు పార్కులను కాపాడిన హైడ్రా

- **5797 గజాల పార్కు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్**

**ముద్ర, హైదరాబాద్:**



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, విలేజ్‌లో రెండు పార్కులను హైడ్రా గురువారం కాపాడింది. సర్వే నంబరు 152, 153లలో 15 ఎకరాల మేర 144 పాట్లతో శ్రీ వేంకటరమణ కాలనీ పేరిట లే ఔట్ వేశారు. మునోత్ ప్రైవేట్ ట్రస్ట్ కు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న ఫవర్‌లాల్ ఈ లే ఔట్ వేయగా.. తర్వాత 2012లో ఆ బాధ్యతలు చేపట్టిన మహేకుమార్ జైన్ ఇందులో 7 ఎకరాలను వ్యవసాయ భూమిగా పేర్కొంటూ అమ్మేశారు. 15 ఎకరాలలో వేసిన లే ఔట్‌కు హుడా అనుమతి ఉంది. అయినా ఇందులో 7 ఎకరాలను వ్యవసాయ భూమిగా అమ్మేశారని వెంకటరమణ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 7 ఎకరాలకు సంబంధించిన వివాదం కోర్టులో ఉంది. ఇదే అదనుగా మిగిలిన 8 ఎకరాల లే ఔట్‌లోని 4960 గజాలతో ఓ పార్కు, 837 గజాలతో మరో పార్కు కబ్జా చేసే ప్రమాదం ఉంది.. కాపాడాలని హైడ్రాకు వినతి పత్రం సమర్పించారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖలతో హైడ్రా అధికారులు పరిశీలించారు. అప్పట్లో హుడా అనుమతి పొందిన లే ఔట్ ప్రకారం పార్కు స్థలాలను గుర్తించారు. తర్వాత పార్కుల చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేశారు. పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. హైడ్రా కాపాడిన పార్కు స్థలాల విలువ దాదాపు రూ. 47 కోట్లవరకూ ఉంటుందని అంచనా.



## ప్రజా పాలన ప్రణాళికతో గ్రామాభివృద్ధి

- **కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధికి 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం దోహదపడుతుందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని తర్నికల్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..., ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను తెలుసుకుని ప్రణాళికలు రూపొందించడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 460 గ్రామ పంచాయతీలు, నాగర్ కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీల పరిధిలోని 85 వార్డుల్లో గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, మండల స్థాయి అధికారులు, తర్నికల్ గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, ఉపసర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విక్రయాల్లో స్కోడా రికార్డు

**ముద్ర, హైదరాబాద్ :**



స్కోడా ఆటో ఇండియా 2026 తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో 20,028 కార్ల విక్రయాలతో రికార్డు స్థాయి పనితీరును నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో ఇది 17 శాతం వృద్ధి కావడం విశేషం. కంపెనీ వృద్ధికి స్కోడా కైలాక్, స్కోడా కుషాక్, స్కోడా స్లావియా, స్కోడా కొడియాక్మోడళ్లకు ఉన్న బలమైన డిమాండ్ ప్రధాన కారణంగా నిలిచింది. ప్రత్యేకంగా కైలాక్ ఇప్పటికే 50,000 అమ్మకాల మైలురాయిని దాటడం కంపెనీకి మరింత ఊతమిచ్చింది. స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా మాట్లాడుతూ, 2025లో సాధించిన రికార్డులను కొనసాగిస్తూ 2026లోనూ బలమైన వృద్ధిని నమోదు చేయడం ఆనందదాయకమని చెప్పారు. విస్తరిస్తున్న మార్కెట్ పరిధి, వినియోగదారుకేంద్రిత కార్యక్రమాలు, మెరుగైన ఉత్పత్తి శ్రేణి ఈ విజయానికి కారణమని తెలిపారు. అదనంగా "స్కోడా సూపర్ కేర్" ద్వారా 4 వారంలో, రోడ్‌సైడ్ సహాయం, ఉచిత సర్వీసులు అందిస్తూ సంవత్సరాల విశ్వాసాన్ని పెంచుతోంది. దేశంలో 180కి పైగా నగరాల్లో 330 టచ్‌పాయింట్లతో కంపెనీ తన సేవలను విస్తరిస్తోంది. మొత్తంగా కొత్త మోడల్ ప్రవేశం, ఆధునిక సాంకేతికత, మెరుగైన సేవలతో స్కోడా ఆటో ఇండియా భారత మార్కెట్లో తన స్థాయిని మరింత బలపరుస్తోంది.

# అమరావతి బిల్లుకు ఆమోదం

**ముద్ర డెస్క్ :**




ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. అంతకుముందు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఎంపీ రేణుకా చౌదరి చర్చ ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైకాపా వాకౌట్ చేసింది. ఇప్పటికే అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతికి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉంటాయన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో అమరావతి చట్టబద్ధత బిల్లు చట్టంగా మారనుంది. మొత్తం 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ బిల్లుపై చర్చలో పాల్గొనగా.. 10 పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.

**పది పార్టీల ఎంపీల మద్దతు:**

అమరావతికి చట్టబద్ధతకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, ఆప్, తృణమూల్, బీజేడీ, జేడీయూ, ఆర్‌జేడీ, బీఆర్ ఎశ్, ఉద్ధవ్ శివసేన పార్టీల ఎంపీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిగా అమరావతి ఏర్పాటైన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో అమరావతి అంతర్జాతీయ నగరంగా ఎదుగుతుందని ఆకాంక్షించారు. అమరావతిపై దేశం మొత్తం ఏకతాటిపై నిలవగా రాష్ట్రానికే చెందిన వైసీపీ మాత్రం వ్యతిరేకంగా నిలిచింది. లోక్‌సభలోనూ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడిన ఆ పార్టీ సభ్యులు అదే వైఖరిని పెద్దలసభలోనూ అవలంబిస్తూ రాజ్యసభ నుంచీ వాకౌట్ చేశారు. బిల్లుపై అన్ని పార్టీల సభ్యుల ప్రసంగాలపై జవాబిచ్చిన కేంద్రమంత్రి నిత్యానందరాయ్ ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రూపంలో కొత్త రాజధాని వచ్చిందని అభినందనలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



అమరావతి చరిత్ర : 2022–2024 – న్యాయపోరాటాలు

అమరావతి అంశం కోర్టులకు వెళ్లింది. రాజధాని హక్కులపై న్యాయపరమైన చర్చలు సాగాయి.






# 2011 వరల్డ్ కప్ విక్టరీకి 15 ఏళ్లు

"ఇండియా లిఫ్ట్ ది వరల్డ్ కప్ ఆఫ్టర్ 28 ఇయర్స్".. అని రవిశాస్త్రి అరుస్తూ చెప్పిన కామెంటరీ ఇప్పటికీ ప్రతి ఇండియన్ క్రికెట్ అభిమాని చెవుల్లో మార్మోగుతూనే ఉంటుంది. 2011 ఏప్రిల్ 2.. కోట్లాది భారతీయుల కల నిజమైన రోజు. ఇండియా రెండో సారి వన్డే ప్రపంచకప్ దక్కించుకున్న రోజు. ఆ అద్భుతానికి ఈ రోజుతో సరిగ్గా 15 ఏళ్లు నిండాయి. మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో భారత్ 2011 వన్డే ప్రపంచకప్ గెలుచుకుంది. భారత్ రెండోసారి 50 ఓవర్ల ప్రపంచ కప్ గెలిచి నేటికి సరిగ్గా 15 ఏళ్లు పూర్తయ్యాయి. 2011 ఏప్రిల్ 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో ధోని కొట్టిన ఆ అద్భుతమైన సిక్సర్ ఇప్పటికీ ప్రతి భారతీయుడి గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఆ షాట్ కొట్టిన క్షణం దేశమంతా పండగ చేసుకుంది, కానీ ఆ విజయం తర్వాత భారత క్రికెట్‌లో ఊహించని మార్పులు మొదలయ్యాయి. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ భావోద్వేగానికి లోనయ్యారు.ఎంఎస్ ధోని సారథ్యంలో టీమ్ ఇండియా ఫైనల్లో శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టు ను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. ఆసియా ఖండానికి చెందిన రెండు జట్లు వరల్డ్ కప్ ఫైనల్లో తలపడటం ఇదే మొదటిసారి. ఐదు వరల్డ్ కప్‌లు ఆడిన సచిన్ టెండూల్కర్ కు, ఈ కప్ ప్రత్యేకం. తన కెరీర్‌లో చివరి వరల్డ్ కప్‌గా భావించిన ఈ టోర్నీలో ఆయన కల నెరవేరింది. ఫైనల్లో 18 పరుగులు మాత్రమే చేసినా, మొత్తం టోర్నీలో కీలక పాత్ర పోషించాడు. జట్టు గెలిచిన తర్వాత ఆటగాళ్లు సచిన్‌ను భుజాలపై ఎత్తుకొని స్టేడియం చుట్టూ తిప్పడం అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

# 19వ సారి ఆల్‌అవుట్ ఫీట్..



## రాజస్థాన్‌ను దాటేసిన ఢిల్లీ, అగ్రస్థానంలో ముంబై

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ చరిత్రలో ఢిల్లీ క్యాపిటల్స్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేసిన సందర్భాల్లో 19వ సారి ఈ ఘనత సాధించిన ఢిల్లీ, ఈ క్రమంలో రాజస్థాన్ రాయల్స్‌ను వెనక్కి నెట్టింది. ఇప్పటివరకు 18 సార్లు ఈ ఫీట్ సాధించిన రాజస్థాన్‌ను అధిగమించి ఢిల్లీ ముందంజ వేసింది. టీ20 ఫార్మాట్‌లో బ్యాట్స్‌మెన్ ఆధిపత్యం ఎక్కువగా ఉండటంతో ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేయడం అంత సులభం కాదు. అయినప్పటికీ ఢిల్లీ బౌలర్లు సమష్టిగా మెరుగైన ప్రదర్శనతో ఈ రికార్డును సాధించారు. దీంతో ఐపీఎల్‌లో అత్యధిక సార్లు ప్రత్యర్థులను ఆలౌట్ చేసిన జట్ల జాబితాలో ఢిల్లీ తన స్థానం మరింత బలపర్చుకుంది. ఈ జాబితాలో ముంబై ఇండియన్స్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు ఇప్పటివరకు 40 సార్లు ప్రత్యర్థులను ఆలౌట్ చేసి ఇతర జట్లకు అందని దూరంలో ఉంది. తరువాతి స్థానాల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి జట్లు ఉన్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ సమానంగా 19 సార్లతో నిలిచాయి.



# ఐపీఎల్ బెస్ట్ కెప్టెన్ రోహిత్
## రజత్ పటీదార్



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ కెప్టెన్‌గా రోహిత్ శర్మ పేరును ఆర్‌సీబీ సారథి రజత్ పటీదార్ వెల్లడించారు. అలాగే బెస్ట్ బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ, అత్యుత్తమ వికెట్ కీపర్‌గా మహేంద్ర సింగ్ ధోనీ పేర్లు సూచించారు. ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో పటీదార్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కవర్ డ్రైవ్‌లోనూ కోహ్లీనే బెస్ట్ అని పేర్కొన్న ఆయన, ఫీల్డింగ్‌లో ఫాఫ్ డుప్లెసిస్ అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. ఫాస్ట్ బౌలింగ్‌లో డేల్ స్టెయిన్, స్పిన్‌లో సునీల్ నరైన్ పేర్లు సూచించిన పటీదార్.. ఫినిషర్‌గా ఏబీ డివిలియర్స్‌ను ఎంపిక చేశారు. డెత్ ఓవర్లలో జస్‌ప్రీత్ బుమ్రా అత్యుత్తమ బౌలర్ అని వెల్లడించారు. అయితే రోహిత్‌ను బెస్ట్ కెప్టెన్‌గా పేర్కొనడంపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ధోనీనే ఆల్‌టైమ్ గ్రేట్ అని వాదిస్తుండగా, మరికొందరు రోహిత్‌కే మద్దతు ఇస్తున్నారు. ఇక ఐపీఎల్ 2026లో ఆర్‌సీబీ మంచి ఆరంభం చేసింది. తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై విజయం సాధించిన ఆర్‌సీబీ, తదుపరి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఎదుర్కోనుంది



# మ్యాచ్ మధ్యలో స్టబ్స్–యాదవ్ వాగ్వాదం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఎల్ఎస్‌జి, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ సందర్భంగా రెండు జట్ల ఆటగాళ్లు ప్రియం యాదవ్, ట్రిస్టన్ స్టబ్స్ మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బౌలింగ్ చేస్తున్న సమయంలో యాదవ్, స్టబ్స్ వైపు కోపంగా చూడగా, అతడూ అదే తరహాలో స్పందించినట్లు కనిపించింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగినట్లు వీడియోలో స్పష్టమైంది. అయితే పరిస్థితి మరింత ముదరకముందే అదుపులోకి వచ్చింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు 141 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా, తర్వాత స్టబ్స్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. స్టబ్స్ 32 బంతుల్లో 39 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు యాదవ్ కూడా బౌలింగ్‌లో మెరుగ్గా రాణించాడు. చివరికి ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# ఐపీఎల్ ఆడేందుకు కోర్టు మెట్లెక్కిన తుషారా..

### ఎన్‌ఓసీపై వివాదం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ 2026లో ఆడేందుకు అనుమతి నిరాకరించడంపై శ్రీలంక పేసర్ నువాన్ తుషారా కోర్టును ఆశ్రయించాడు. తనకు వెంటనే నిరభ్యంతర పత్రం (NOC) ఇవ్వాలని కోరుతూ కొలంబో జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఇందులో శ్రీలంక క్రికెట్ బోర్డు ఉన్నతాధికారులను ప్రతివాదులుగా చేర్చాడు. ఫిట్‌నెస్ ప్రమాణాలు లేవన్న కారణంతోనే తనకు ఎన్‌ఓసీ ఇవ్వలేదని తుషారా ఆరోపించాడు. అయితే తన కాంట్రాక్ట్ మార్చి 31తో ముగిసిందని, దాన్ని పొడిగించుకునే ఉద్దేశం లేదని ముందే బోర్డుకు తెలిపినట్లు వెల్లడించాడు. గతంలో ఇదే ఫిట్‌నెస్‌తో ఐపీఎల్‌కు అనుమతి ఇచ్చిన బోర్డు ఇప్పుడు అడ్డుకోవడం అన్యాయమని వాదించాడు. ఎన్‌ఓసీ రాకపోతే ఆర్సీబీ తన స్థానంలో మరో ఆటగాడిని తీసుకునే అవకాశం ఉందని, దీంతో తన కెరీర్‌కు నష్టం జరుగుతుందని తుషారా ఆవేదన వ్యక్తం చేశాడు. తక్షణమే ఎన్‌ఓసీ మంజూరు చేయాలని కోర్టును కోరాడు. ఈ కేసు విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేశారు.

# సంజీవ్ గోయెంకాపై నెట్టింట రచ్చ రచ్చ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ ఓటమి అనంతరం ఆ జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా ప్రవర్తనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో పరాజయం తర్వాత కెప్టెన్ రిషబ్ పంత్‌ను ఆయన మందలించినట్లు వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పంత్ వైఫల్యం కారణంగానే జట్టు ఓడిపోయిందని భావించిన గోయెంకా, మ్యాచ్ ముగిసిన వెంటనే కోచ్ లాంగర్‌తో పాటు పంత్‌పై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఓటమి తర్వాత కెప్టెన్‌ను అందరి ముందే ఇలా మందలించడం సరైనది కాదని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే తరహా ఘటనలు జరిగినట్లు నెటిజన్లు గుర్తుచేస్తున్నారు. రైజింగ్ పూణె సూపర్ జెయింట్స్ సమయంలో మహేంద్ర సింగ్ ధోనీతో పాటు, 2024లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి తర్వాత కేఎల్ రాహుల్‌ను కూడా గోయెంకా ఇలాగే మందలించాడని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో గోయెంకా ప్రవర్తనపై మరోసారి చర్చ మొదలైంది. జట్టులో మార్పులు చేసినప్పటికీ లక్నోకు ఆశించిన ఫలితాలు రావడం లేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.






# స్టేడియంలో తన్నుకున్నారు

### స్టేడియంలో డీసీ, ఎల్ఎస్‌జీ ఫ్యాన్స్ ఫైట్..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా స్టేడియంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. లక్నో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈ క్రమంలో రెండు జట్ల అభిమానుల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి చేరుకున్నారు. పక్కన ఉన్నవారు ఆపేందుకు ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని గొడవను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత ప్రదర్శనతో 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు 141 పరుగులకే ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ ఆరంభంలో కాస్త తడబడ్డప్పటికీ, చివరికి స్థిరంగా ఆడి మ్యాచ్‌ను తమ ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో టోర్నమెంట్‌లో ఢిల్లీ తన తొలి గెలుపును నమోదు చేసుకుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews







# పీరియాడిక్ డ్రామాగా "తిమ్మరాజుపల్లి టీవీ"




ముద్ర, సినిమా డెస్క్ :


న్యూ టాలెంట్‌ను ప్రోత్సహించే ప్రయత్నంలో హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుమైర స్టూడియోస్‌తో కలిసి "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా ఉన్న ఈ సినిమాతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో, హీరోయిన్‌లుగా పరిచయం అవుతుండగా, వి. మునిరాజు దర్శకుడిగా రంగ ప్రవేశం చేస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 17న థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. ఓవర్సీస్‌లో ఈ సినిమాను శ్లోక ఎంటర్‌టైన్‌మెంట్స్, వైబ్రెంట్ మూవీస్ సంస్థలు విడుదల చేయనున్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## లైట్ పింక్ గౌనులో వేదిక గ్లామర్ షో..

ముద్ర, సినిమా డెస్క్ :

తన నటనతో పాటు అందంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి వేదిక తమిళ సినిమాల ద్వారా కెరీర్‌ను ప్రారంభించి మంచి గుర్తింపు పొందింది. పలు చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీ ఇటీవలి కాలంలో వెబ్ సిరీస్‌లలో కూడా తన సత్తా చాటుతోంది. ఇటీవల 'యక్షిణి' వెబ్ సిరీస్‌లో కనిపించి ప్రేక్షకులను మెప్పించింది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండే వేదిక, తరచూ తన ఫోటోషూట్‌లతో ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఫోటోలలో లైట్ పింక్ కలర్ స్టోన్ ఎంబ్రాయిడరీ లాంగ్ గౌన్‌లో వేదిక స్టైలిష్‌గా మెరిసింది. స్లీవ్‌లెస్ డిజైన్, చిన్ని డీటెయిల్స్‌తో ఆమె లుక్ మరింత గ్లామర్‌ను హైలైట్ చేస్తూ అభిమానులను ఆకర్షిస్తోంది.

# రూమర్స్‌కు చెక్ పెట్టిన రామ్ చరణ్



ముద్ర, సినిమా డెస్క్ :

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదలపై గత కొన్ని రోజులుగా వస్తున్న వాయిదా వార్తలకు స్వయంగా ఆయన క్లారిటీ ఇచ్చారు. మొదట ఏప్రిల్ 30న రిలీజ్ ప్లాన్ చేసిన ఈ సినిమా షూటింగ్ ఆలస్యం కారణంగా జూన్‌కు మారిందన్న ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. అయితే ఈ రూమర్స్‌పై స్పందించిన రామ్ చరణ్, సినిమా వాయిదా పడడం లేదని స్పష్టంగా తెలిపారు. 'రాకాస' మూవీ టీమ్‌తో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని చెప్పి, తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని అభిమానులకు సూచించారు. ఇకపోతే, షూటింగ్ ఇంకా పూర్తి కాలేదనే టాక్ నేపథ్యంలో సినిమా సమయానికి సిద్ధమవుతుందా అన్న సందేహాలు మాత్రం కొనసాగుతున్నాయి. అయినప్పటికీ చరణ్ ఇచ్చిన క్లారిటీతో మెగా అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు

## ముగ్గురు హీరోయిన్లతో శింబు రొమాన్స్

ముద్ర, సినిమా డెస్క్ :

కోలీవుడ్ స్టార్ హీరో శింబు ప్రస్తుతం 'అరసన్' షూటింగ్‌లో నిమగ్నమై ఉన్నారు. ఈ మధ్యలోనే ఆయన కొత్త ప్రాజెక్ట్ STR 51పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాను యువ దర్శకుడు అశ్వత్ వైరముత్తు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో శింబుకు జోడీగా ముగ్గురు హీరోయిన్లను తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు టాక్. ఇప్పటికే మీనాక్షి చౌదరి పేరు ఫైనల్ అయ్యిందని ప్రచారం జరుగుతుండగా, రుక్మిణి వసంత్, మృణాల్ ఠాకూర్‌లతో కూడా చర్చలు కొనసాగుతున్నాయట. ఇక అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించే అవకాశముందన్న వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొస్తోంది. అయితే హీరోయిన్‌ల ఎంపికపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.



# హనుమాన్ జయంతిరోజున చిరంజీవి ఇంట్లో అద్భుతం

ముద్ర, సినిమా డెస్క్ :

మెగాస్టార్ చిరంజీవి హనుమంతుడిపై ఉన్న తన భక్తిని మరోసారి వెల్లడించారు. హనుమాన్ జయంతి సందర్భంగా తన ఇంట్లో చోటుచేసుకునే ఒక ప్రత్యేకమైన దృశ్యాన్ని అభిమానులతో పంచుకున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యలో సూర్యకిరణాలు సప్తవర్ణాలుగా విరబూసి, తన ఇంట్లోని హనుమంతుడి విగ్రహాన్ని పాదాల నుంచి శిరస్సు వరకు తాకుతూ వెళ్లడం విశేషమని ఆయన తెలిపారు. ఈ ఘటన తనకు ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. అయోధ్యలో బాలరాముడి నుదిటిపై పడే 'సూర్య తిలకం'ను గుర్తు చేస్తూ, ఇలాంటి దైవానుభూతి తన ఇంట్లోనూ కలగడం అదృష్టంగా భావిస్తున్నానని చిరంజీవి వెల్లడించారు. అరసవిల్లి, కోణార్క్ వంటి క్షేత్రాల్లో కనిపించే ఈ విశేషం తన ఇంట్లోనూ జరగడం ప్రత్యేకమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులకు, భక్తులకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

# థియేటర్ రెంటల్ సిస్టమ్ కు గుడ్‌బై..

## నేటి నుంచి టాలీవుడ్‌లో పర్సంటేజీ విధానం ప్రారంభం

ముద్ర, సినిమా డెస్క్ :

టాలీవుడ్ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య చాలాకాలంగా కొనసాగుతున్న 'రెంటల్' వివాదానికి తెరపడింది. తెలంగాణలోని థియేటర్ యాజమాన్యాలు ఇకపై రెంటల్ విధానాన్ని రద్దు చేసి, వసూళ్లలో వాటా పంచుకునే 'పర్సంటేజీ సిస్టమ్' అమలు చేయాలని నిర్ణయించాయి. ఈ కొత్త విధానానికి రాష్ట్రంలోని 23 ప్రధాన థియేటర్లు ఇప్పటికే అంగీకారం తెలిపాయి. ఏప్రిల్ 3 నుంచి ఈ విధానం అధికారికంగా అమల్లోకి రానుంది. దీంతో డిస్ట్రిబ్యూటర్లపై ఉన్న ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. మఇప్పటి వరకు సినిమా ఫలితంతో సంబంధం లేకుండా థియేటర్లకు స్థిర అద్దె చెల్లించాల్సి వచ్చేది. సినిమా ఫ్లాప్ అయితే డిస్ట్రిబ్యూటర్లు భారీ నష్టాలను ఎదుర్కొనేవారు. కానీ కొత్త విధానంలో వసూళ్ల ఆధారంగా ఆదాయం పంచుకుంటారు. సినిమా హిట్ అయితే లాభాలు ఇద్దరికీ దక్కుతాయి, లేకపోతే నష్టాన్ని కూడా భాగస్వామ్యం చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా చిన్న, మధ్యస్థాయి సినిమాలకు ఈ మార్పు కొంత ఉపశమనం కలిగించనుంది.







# డేరింగ్ సారీ లుక్‌తో ఆకట్టుకున్న పాయల్

ముద్ర, సినిమా డెస్క్ :

బోల్డ్ పాత్రలతో గుర్తింపు పొందిన పాయల్ రాజ్‌పుత్ తాజాగా జరిగిన 'Teach for Change' ఈవెంట్‌లో సంప్రదాయ సారీ లుక్‌లో మెరిసింది. సాదా సారీ కట్టుకున్నప్పటికీ ఆమె స్టైల్, కాన్ఫిడెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరూన్‌గోల్డ్ కలర్ సిల్క్ సారీలో జరీ బోర్డర్‌తో రాయల్ లుక్‌లో కనిపించిన పాయల్, డీప్ నెక్ బ్లౌజ్‌తో మోడర్న్ టచ్ ఇచ్చింది. ఈ డేరింగ్ డిజైన్ ఆమె గ్లామర్‌ను మరింత హైలైట్ చేసింది. ఎమరాల్డ్, డైమండ్ జ్యువెలరీతో లుక్‌ను ఎలిగెంట్‌గా కంప్లీట్ చేసింది. చివరిసారిగా 'రక్షణ' సినిమాలో కనిపించిన పాయల్, ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అప్పటి నుంచి మంచి అవకాశాల

# కట్‌అవుట్ స్టైల్స్‌తో మెరిసిన శర్మ సిస్టర్స్

ముద్ర, సినిమా డెస్క్ :

నేహా శర్మ, ఐషా శర్మ మరోసారి తమ స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. తాజాగా జరిగిన గ్రాజియా ఫ్యాషన్ అవార్డ్స్ 2026లో ఈ సోదరీమణులు గ్లామర్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోల్డ్, ట్రెండీ కట్‌అవుట్ డిజైన్స్‌తో వచ్చిన వీరి అవుట్‌ఫిట్స్ ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకున్నాయి. సినిమాలు తక్కువగా చేస్తున్నప్పటికీ, ఫ్యాషన్, ఫిట్‌నెస్, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు లైమ్‌లైట్‌లో ఉండడం వీరి ప్రత్యేకతగా మారింది. ప్రతి ఈవెంట్‌లో తమ స్టైల్‌తో మెప్పిస్తున్న శర్మ సిస్టర్స్ మరోసారి తమ గ్లామర్ ప్రెజెన్స్‌తో స్పాట్‌లైట్‌ను పూర్తిగా దక్కించుకున్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com